# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

సంపుటి : 09 సంచిక : 118 పేజిలు : 08, వెల రూ. 5రూ/ గురువారం- 01 - మే - 2025


కులగణన నిర్ణయాన్ని

## స్వాగతిస్తున్నాం



2

- దేశంలోనే తొలిసారి తెలంగాణలో కులగణన చేశామని,
- జనాభాలో 56.32 శాతం మంది వెనుకబడిన కులాలకు చెందినవారని
- కేంద్ర ప్రభుత్వం కుల గణనకు అంగీకరించాలని కోరుతూ దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన

హైదరాబాద్ : బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశాల్లో దేశ జనాభా లెక్కల తోపాటు, కులగణన కూడా చేపట్టాలనే సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కాగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీకి, కేబినెట్ మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్టీసీని కాపాడుకునే

# బాధ్యత మీదే

- సమ్మె విరమించుకోవాలని ఆర్టీసీ కార్మికులకు రేవంత్ విన్నపం
- ఆర్టీసీ క్రమంగా లాభాల బాట పడుతోందన్న సీఎం
- సమ్మె వల్ల రాష్ట్రానికి నష్టం వాటిల్లుతుందని వ్యాఖ్య
- అణా పైసా కూడా నేను ఇంటికి తీసుకెళ్లను. అంతా మీ కోసమే ఖర్చు చేస్తాం" అని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

"వచ్చే ఆదాయమంతా మీ చేతిలోనే పెడతాం.



వివరాలు 2లో..

హైదరాబాద్ : మే డే ఉత్సవాల వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీఎస్ఆర్టీసీ కార్మికులకు కీలక విజ్ఞప్తి చేశారు. సంస్థ ఇప్పుడిప్పుడే ఆర్థికంగా కోలుకుంటున్న తరుణంలో, సమ్మె ఆలోచనను విరమించుకోవాలని ఆయన కార్మికులను కోరారు. "ఆర్టీసీ సంస్థ క్రమంగా లాభాల బాట పడుతోంది. ఇది మీ అందరి సంస్థ. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉంది" అని ఆయన అన్నారు. కార్మికులు పంతాలు, పట్టింపులకు పోకుండా సంయమనం పాటించాలని హితవు పలికారు.

మేడే స్ఫూర్తితో తెలంగాణలో

## అసమానతలు తొలగిపోయేలా కృషి చేయాలి



2

- మేడే సందర్భంగా కార్మికులకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత శుభాకాంక్షలు తెలిపారు.
- కార్మికుల శ్రేయస్సు కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ఎమ్మెల్సీ కవిత గుర్తుచేశారు.
- అధికారం కోసం దిగజారే నైజం రేవంత్ రెడ్డిది అని విమర్శించారు.
- రైతుబంధు కింద ఎకరం ఉంటే రూ.10 వేలు.. పది ఎకరాలుంటే లక్ష రూపాయలు ఇచ్చామని..

హైదరాబాద్: భౌగోళిక తెలంగాణ తెచ్చుకున్నప్పటకీ.. సామాజిక తెలంగాణ సాధించలేకపోయామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మేడే సందర్భంగా కార్మికులకు కవిత శుభాకాంక్షలు తెలిపారు. ఇవాళ(గురువారం) తెలంగాణ భవన్‌లో కవిత మీడియాతో మాట్లాడారు. సామాజిక తెలంగాణ దిశగా భవిష్యత్తు అడుగులుండాలని చెప్పారు. మేడే స్ఫూర్తితో తెలంగాణలో అసమానతలు తొలగిపోవటానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం రూ. 8లక్షలు ఉంటే.. వికారాబాద్‌లో లక్ష 58వేలు మాత్రమేనని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. పది కిలోమీటర్లు దూరంలోనే

పంచాయతీరాజ్ నిధులు రాష్ట్రానికి

# ప్రాణవాయువు అయ్యాయి

## "ఉపాధి హామీ పథకం రాష్ట్రం, దేశానికి ఒక వరం.

- ★ రక్తం ధారపోసి పనిచేసేవారు లేకపోతే ఏ నిర్మాణం జరగదు
- ★ ఉపాధి కూలీలను ఉపాధి శ్రామికులుగా పిలుస్తామన్న పవన్ కల్యాణ్
- ★ ఉపాధి శ్రామికుల సంక్షేమం మాకు చాలా ముఖ్యం" అని పవన్ కల్యాణ్
- ★ ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించి అధికారులు శుద్ధమైన నీరు అందించాలి" అని పవన్ కల్యాణ్ స్పష్టం




వివరాలు 2లో..

అమరావతి: ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైన పరిస్థితుల్లో పంచాయతీరాజ్ నిధులు రాష్ట్రానికి ప్రాణవాయువు అయ్యాయని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్రాభివృద్ధికి వెన్నెముకగా మారిందని తెలిపారు. దాదాపు 46 లక్షల 94 వేల కుటుంబాలు 75 లక్షల 23 వేలమంది శ్రామికులు సొంత గ్రామాల్లోనే ఉపాధి పొందుతున్నారని వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరి సి.కె.కన్వెన్షన్ హాలులో మేడే ఉత్సవాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. ఉపాధి హామీ శ్రామికులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఉపాధి హామీ పథకం రాష్ట్రం, దేశానికి ఒక వరం. గత ఆర్థిక సంవత్సరంలోనే రూ.10,669 కోట్లు ఖర్చు చేశాం. కేవలం వేతనాలకే రూ.6,194 కోట్లు ఖర్చు చేశాం. మెటీరియల్ కింద రూ.4,023 కోట్లు ఖర్చు చేశాం. పల్లెపండుగలో భాగంగా ఇప్పటికి రూ.377.37 కోట్లతో


# ప్రధాని మోదీ ఏపీ పర్యటన షెడ్యూల్

- ఏపీలో ప్రధాని మోదీ పర్యటన షెడ్యూల్ విడుదలైంది.
- మే 2న మధ్యాహ్నం 2:55 గంటలకు మోదీ గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు.
- గన్నవరం విమానాశ్రయంలో మోదీకి మంత్రులు, కూమిటి నేతలు స్వాగతం పలుకనున్నారు.



2

# ఇది నరేంద్రమోదీ ప్రభుత్వం.. ఎవరినీ వదిలిపెట్టదు



2

- ఉగ్రవాదంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కఠిన హెచ్చరిక
- పిరికిపంద దాడులతో గెలిచామని భ్రమ పడవద్దని వ్యాఖ్య
- ఇది నరేంద్ర మోదీ ప్రభుత్వమని, ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టీకరణ
- దేశం నుంచి ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని దృఢ సంకల్పం

భారత్ అంటే

## పాక్‌కు భయం..



2

- అమెరికా భారత్ మధ్య యుద్ధం జరిగేందుకు 20 శాతం అవకాశం ఉందని
- 1993లో ఓ సీఐఏ అధికారి అంచనా వేశారు.
- తాజాగా వెలుగులోకి వచ్చిన ఆయన నివేదిక ప్రస్తుతం ఆసక్తి రేకెత్తిస్తోంది.

ఢిల్లీ : పహల్గాం దాడి తరువాత భారత్ పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిపోయాయి.

20 లక్షల మందికి ఉపాధి కల్పించి

# అవినీతిరహిత పరిపాలన ఇస్తాం

- రాష్ట్రంలో తొలిదశలో పూర్తిచేసిన 11 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ప్రతి నియోజకవర్గంలో ఈ పార్కులను ఏర్పాటు చేస్తామని వెల్లడి
- రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే సహించలేనివారు ఉన్నారని సీఎం చంద్రబాబు
- ఆస్పత్రులు నిర్మిస్తున్నామని ఆంధ్ర యువతకు ఉపాధి కల్పించడానికి అమరావతి నగరాన్ని నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు



వివరాలు 2లో..

అమరావతి : రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే సహించలేనివారు ఉన్నారని సీఎం చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. స్థానిక ఎస్టీ కాలనీలో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడి బాగోగులు తెలుసుకున్నారు.

**20 లక్షల మందికి ఉపాధి కల్పించి అవినీతిరహిత పరిపాలన ఇస్తాం: సీఎం చంద్రబాబు**

175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు: అనంతరం మేడే సందర్భంగా రాష్ట్రంలో తొలిదశలో పూర్తిచేసిన 11 ఎంఎస్ఎంఈ పార్కులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. నారంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేశారు. రూ.216 కోట్లతో ఈ 11 పార్కులను ప్రభుత్వం పూర్తి చేసింది. దీంతో పాటు మరో 39 ఎంఎస్ఎంఈ పార్కులను రూ.376 కోట్లతో అభివృద్ధి చేస్తోంది. పూర్తయిన పార్కులు అనకాపల్లి, పీలేరు, రాజానగరం, బద్వేల్, గన్నవరం, పాణ్యం,

ఇదీ ఓ గెలుపేనా?:

## చంద్రబాబుపై జగన్ ఫైర్



2

- టీడీపీ ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్ తీవ్రస్థాయిలో ధ్వజం
- రాష్ట్రంలో 'రాక్షస పాలన' సాగుతోందని వ్యాఖ్య
- స్థానిక ఎన్నికల్లో బెదిరింపులు, ప్రలోభాలకు పాల్పడ్డారని ఆరోపణ
- కుప్పం, పిఠాపురం, మార్కాపురం, గాండ్లపెంట ఘటనల ప్రస్తావన
- కార్యకర్తలకు 'జగన్ 2.0'లో పెద్దపీట వేస్తానని భరోసా

## 20 లక్షల మందికి ఉపాధి కల్పించి

## అవినీతిరహిత పరిపాలన ఇస్తాం

మొదటి పేజి తరువాయి

డోన్, ఆత్మకూరు (నారంపేట), దర్శి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో ఉన్నాయి. వీటితో పాటు రాంబిల్లిలోని ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌నూ (ఎఫ్ఎఫ్‌సీ) సీఎం ప్రారంభించారు. 2028 నాటికి రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కార్మికుల కోసం 100 పడకల ఆస్పత్రులు: అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ దేశంలో అసంఘటిత కార్మికులే అధికమని, గత ఐదేళ్లు వీరు అనేక కష్టాలు పడ్డారని చెప్పారు. ఇసుక ద్వారా ప్రభుత్వానికి రూ. వేల కోట్ల ఆదాయం వస్తుందని కానీ ఆ ఆదాయాన్ని వదులుకుని మరీ ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నామని అన్నారు. నిర్మాణ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని అలాగే నాలా చట్టాన్ని రద్దు చేశామని తెలిపారు. కార్మికుల కోసం కర్నూలు, గుంటూరులో 100 పడకల ఆస్పత్రులు నిర్మిస్తున్నామని ఆంధ్ర యువతకు ఉపాధి కల్పించడానికి అమరావతి నగరాన్ని నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని సీఎం కొనియాడారు. ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి కొంతభాగం వారికి ఇచ్చి ఆ రైతులను కోటీశ్వరులుగా మారుస్తున్నామని వివరించారు. ఇప్పుడు రాజధానిలో భూముల విలువ పెరిగిందని 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు.

## ఇది నరేంద్రమోదీ ప్రభుత్వం.. ఎవరినీ వదిలిపెట్టదు

ఢిల్లీ : "పిరికితనంతో చాటుగా వచ్చి దాడి చేసి ఇది తమ గొప్ప విజయమని ఎవరైనా భావిస్తే ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఇది నరేంద్ర మోదీ ప్రభుత్వం. ఎవరినీ విడిచిపెట్టదు" అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరించారు. ఉగ్రవాదంపై పోరాటంలో కేవలం 140 కోట్ల మంది భారతీయులే కాకుండా యావత్ ప్రపంచం భారత్‌కు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. "ప్రపంచంలోని అన్ని దేశాలు సంఘటితంగా ఈ పోరాటంలో భారత ప్రజలతో నిలబడుతున్నాయి" అని ఆయన వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించే వరకు తమ పోరాటం ఆగదని అమిత్ షా పునరుద్ఘాటించారు. "ఈ దుశ్చర్యలకు పాల్పడిన వారికి కచ్చితంగా తగిన శిక్ష లభిస్తుంది" అని ఆయన హెచ్చరించారు.

## మేడే స్ఫూర్తితో తెలంగాణలో అసమానతలు

## తొలగిపోయేలా కృషి చేయాలి

ఇంత వ్యత్యాసం ఉండటం ప్రమాదకరమని అన్నారు. అసమానతలు తొలగిపోవడానికి మేడే స్ఫూర్తి కావాలని చెప్పారు. రైతుబంధు కింద ఎకరం ఉంటే రూ.10 వేలు.. పది ఎకరాలుంటే లక్ష రూపాయలు ఇచ్చామని.. కానీ భూమి లేని కార్మికులకు ఏమీ చేయలేకపోయామని తెలిపారు. భవిష్యత్తులో భూమి ఉన్నా.. లేకున్నా ఎలా ఆదుకోవాలనే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని సూచించారు. మే 20వ తేదీన దేశవ్యాప్తంగా తలపెట్టిన కార్మికుల సమ్మెకు జాగృతి మద్దతు ఇస్తోందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

### అధికారం కోసం దిగజారే నైజం రేవంత్ రెడ్డిది: జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: సొంత పార్టీ ఎమ్మెల్యేలే సీఎం రేవంత్‌రెడ్డి పేరు మరచిపోతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి విమర్శలు చేశారు. ఇవాళ(గురువారం) సూర్యాపేట మునిసిపల్ ఆఫీస్ వద్ద మేడే జెండాను మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ఎగుర వేశారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఒక్క మంచి పని చేయని రేవంత్‌రెడ్డి పేరును ప్రజలు ఎందుకు గుర్తు పెట్టుకుంటారని జగదీష్‌రెడ్డి ప్రశ్నించారు. రేవంత్ వల్ల బాధించబడ్డ వారే ఆయనను ఓడిస్తారని జగదీష్‌రెడ్డి అన్నారు. ముమ్మాటికీ తెలంగాణకి కాంగ్రెసే విలన్ అని ఆక్షేపించారు. అధికారం కోసం దిగజారే నైజం రేవంత్ రెడ్డిది అని విమర్శించారు. పదేళ్లు తమదే అధికారమన్న వాళ్లకు కేసీఆర్ ఫాంహౌస్‌లో ఉంటే అంత భయమెందుకని ప్రశ్నించారు. ఎన్ని రోజులు పదవిలో ఉంటాడో రేవంత్‌రెడ్డికే తెలవదని ఎద్దేవా చేశారు. అమలుకాని హామీలు ఇచ్చి అమలు చేయలేకే బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారని జగదీష్‌రెడ్డి ధ్వజమెత్తారు.

## కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

గతంలో జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ మినహా ఇతర కులాలను పరిగణనలోకి తీసుకునేవారు కాదని, ఈ విషయంపై రాహుల్‌గాంధీ ఎన్నోసార్లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. దీంతో రాహుల్ గాంధీ విజన్ నెరవేరబోతోందని అన్నారు.

### ఇది తెలంగాణ సత్తా.. రాములమ్మ సంచలన పోస్ట్ !

దేశంలోనే తొలిసారి తెలంగాణలో కులగణన చేశామని, ఇది స్వతంత్ర దేశంలోనే మొదటిదని, తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశానికి ఆదర్శం అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర సామాజిక, ఆర్థిక, కుల సర్వే నిర్వహించడం జరిగిందని.. జనాభాలో 56.32 శాతం మంది వెనుకబడిన కులాలకు చెందినవారని తేలిందని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇవ్వాలని అసెంబ్లీలో ఆమోదముద్ర వేశామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కుల గణనకు అంగీకరించాలని కోరుతూ దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలియజేశామని గుర్తు చేశారు.

## ఆర్టీసీని కాపాడుకునే బాధ్యత మీదే

ఏవైనా సమస్యలు ఉంటే, వాటిని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువచ్చి, చర్చల ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. సంస్థకు లభించే ఆదాయం విషయంలో పూర్తి పారదర్శకత పాటిస్తామని స్పష్టం చేశారు. "వచ్చే ఆదాయమంతా మీ చేతిలోనే పెడతాం. దానిని ఎలా ఖర్చు చేయాలో మీరే సూచించండి. అణా పైసా కూడా నేను ఇంటికి తీసుకెళ్లను. అంతా మీ కోసమే ఖర్చు చేస్తాం" అని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అదే సమయంలో, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం ఆశాజనకంగా లేదని సీఎం గుర్తుచేశారు. "గత పదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం, ఆర్థిక దోపిడీ జరిగాయి. ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే గాడిన పడుతోంది. మరో ఏడాదిలో కొంత మెరుగవుతుంది. ఈ తరుణంలో సమ్మెకు దిగడం వల్ల రాష్ట్రానికి నష్టం వాటిల్లుతుంది. దయచేసి ఆలోచించండి" అని ఆయన విజ్ఞప్తి చేశారు. గతంలో ఏమీ చేయని వారు ఇప్పుడు తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయవచ్చని, వారి మాటలు నమ్మవద్దని కార్మికులను హెచ్చరించారు. "కష్టమైనా, నిష్ఠూరమైనా ఉన్నది ఉన్నట్టు చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంది. ఆర్టీసీ కార్మికులు నన్ను నమ్మండి. నమ్ముకున్న మీకు నేను అండగా ఉంటాను" అని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.

## పెన్షన్లు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు

## - ఓ గిరిజన కుటుంబానికి భరోసా

### నెల్లూరు జిల్లా ఆత్మకూరులో సీఎం చంద్రబాబు పర్యటన - లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్లు పంపిణీ



అమరావతి : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో సీఎం చంద్రబాబు స్వయంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. స్థానిక ఎస్టీ కాలనీలో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. కుటుంబసభ్యుల బాగోగులు తెలుసుకున్నారు. తమ సమస్యలను వారు చెప్పుకోగా ప్రభుత్వం తరఫున అందించాల్సిన సాయంపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. నెల్లూరుపాలెం గిరిజన కుటుంబాలతో సెల్ఫీలు, ఫొటోలు దిగారు. గిరిజనకాలనీలో ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం ముందుకు సాగారు. సీఎం తమ కాలనీకి రావడం తమను ఆప్యాయంగా పలకరించడం పట్ల ఆత్మకూరు గిరిజన కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో పర్యటిస్తున్న క్రమంలో గ్రామస్థులు పలు సమస్యలపై సీఎం చంద్రబాబుకు పలు అర్జీలు ఇచ్చారు. ఆ ఫిర్యాదులను వెంటనే పరిష్కరిచాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఎస్టీ కాలనీలో 'పేదల సేవలో ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సుస్మిత అనే గిరిజన యువతి ఇంటికి వెళ్లి పింఛన్ స్వయంగా అందించారు. వితంతు పింఛను పొందుతున్న యువతి సుస్మిత, ఆమె తల్లిదండ్రులు అంకోజి, సుమ, సోదరుడితో మమేకమై వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ నిరుపేద గిరిజన కుటుంబం ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం నుంచి కొండంత భరోసా కల్పించారు. భవన నిర్మాణ కార్మికులతో ముఖాముఖీ: భర్తను కోల్పోయిన గిరిజన యువతి సుస్మితకు డీఎస్సీ కోచింగ్ ఇప్పించాలని, ఐటీఐ చదివిన ఆమె తమ్ముడికి వ్యవసాయ అవసరాలకు వినియోగించే డ్రోన్ ఇప్పించి ఉపాధి కల్పించాలని కోరారు. అలానే సుస్మిత కుమార్తె ఐదేళ్ల చిన్నారిని గురుకుల పాఠశాలలో చేర్పించి విద్యనభ్యసించేలా చర్యలు చేపట్టాలని సీఎంని వారు కోరారు. స్పందించిన సీఎం ఈ కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వపరంగా సహకారం అందించాలని కలెక్టర్ ఆనంద్‌ను ఆదేశించారు. పెన్షన్లు పంపిణీ చేస్తున్న క్రమంలో గ్రామంలోని భవన నిర్మాణ కార్మికులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా వారికి మే డే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మేడే సందర్భంగా రాష్ట్రంలో తొలిదశలో పూర్తిచేసిన 11 ఎంఎస్ఎంఈ పార్కులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. నారంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేశారు.

# పంచాయతీరాజ్ నిధులు రాష్ట్రానికి ప్రాణవాయువు అయ్యాయి

మొదటి పేజి తరువాయి



21,564 గోకులాలు పూర్తి చేశాం. గోకులాల వల్ల ప్రతి రైతుకు నెలకు రూ.4,200 అదనపు ఆదాయం వస్తుంది. రూ.60.75 కోట్లు ఖర్చు పెట్టి 13,500 పశువుల తొట్టెలు పూర్తి చేయగలిగామంటే శ్రామికులకు జై అనాల్సిందే. రూ.317.91 కోట్లతో 63,582 ఎకరాల్లో పండ్ల తోటలు వేశాం. ఉపాధి శ్రామికుల సంక్షేమం మాకు చాలా ముఖ్యం" అని పవన్ కల్యాణ్ తెలిపారు. ఇకపై ఉపాధి శ్రామికులుగా పిలుస్తాం : "రక్తం ధారపోసి పనిచేసేవారు లేకపోతే ఏ నిర్మాణం జరగదు. ఇప్పటి నుంచి ఉపాధి కూలీలను ఉపాధి శ్రామికులుగా పిలుస్తాం. మిగతా వృత్తుల్లో ఉన్నవారిలాగా శ్రామికులు కూడా గొప్పవారే. వైఎస్సార్సీపీ హయాంలో ఆంధ్రప్రదేశ్?ను అప్పుల పాలు చేశారు. మద్యనిషేధం పేరు చెప్పి గత ప్రభుత్వం వ్యాపారం చేసింది. మద్యం కుంభకోణానికి పాల్పడి రూ.3,200 కోట్లు కొల్లగొట్టారు. పంచాయతిరాజ్ నిధులు రాష్ట్రానికి ప్రాణవాయివు అయ్యాయి" అని పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ ఏడాది లక్షా 55 వేల ఫాం పాండ్లు నిర్మిస్తాం. లక్ష ఎకరాల్లో పండ్లతోటలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 5 వేల కిలోమీటర్ల డ్రెయిన్లు నిర్మిస్తాం. పనిచేసే వారికి తగిన గౌరవం ఇవ్వాల్సిందే. వేసవిలో నీటి కొరత పరిష్కారం కోసం వార్ రూం ఏర్పాటు చేస్తాం. వర్షపు నీటిని వృథా చేయొద్దు. ఇంటింటా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయాలి. గత ప్రభుత్వంలో గ్రామీణ నీటి సరఫరా పథకాల ఫిల్టర్ బెడ్లు కూడా మార్చలేదు. ప్రైవేటు ఆర్వో ప్లాంట్ల నిర్వహణ సరిగా లేక నాణ్యమైన నీరు రావటం లేదు. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించి అధికారులు శుద్ధమైన నీరు అందించాలి" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బీమా పరిహారం సొమ్ము పెంచాలి : జనసేన కార్యకర్తల బీమా పరిహారం సొమ్ము పెంచాలని ఆలోచిస్తున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తెలిపారు. అంతకుముందు మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో సభ్యత్వ కిట్ల పంపిణీలో సేవలు అందించిన వాలంటీర్లతో ఆయన సమావే శమయ్యారు. జన సైనికులు, వీర మహిళల ప్రేరణే జనసేన పార్టీకి శ్వాస అని పవన్ తెలిపారు. కార్యకర్తల బలమే తనకూ ప్రధాన శక్తి అని, వారంతా తన ఆత్మ బంధువులని వ్యాఖ్యానించారు.

# భారత్ అంటే పాక్‌కు భయం..

మొదటి పేజి తరువాయి



యుద్ధ భయాలు నెలకున్నాయి. భారత్ చర్యలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాక్ నేతలు తమ నోటికి పనిచెబుతున్నారు. అసలు భారత్, పాక్ మధ్య యుద్ధం అంటూ జరిగితే కశ్మీర్ వల్లేనని 1993లో సీఐఏ అధికారి బ్రూస్ రైడెల్ భావించారు. అప్పటి బాబ్రీ మసీదు కూల్చివేత నేపథ్యంలో భారత్, పాక్ ఉద్రిక్తతలపై ఆయన ఓ నివేదిక సిద్ధం చేశారు. అప్పటి సీక్రెట్ దికలో పాక్ అభద్రత, భయాలను పేర్కొన్నారు. తమ కంటే ఆర్థికంగా, సైనిక పరంగా బలంగా ఉన్న భారత్‌ను చూసి పాక్ భయానికి గురవుతోందని అభిప్రాయపడ్డారు. బలమైన భారత్ తన ఉనికికే ముప్పు అని పాక్ భావిస్తున్నట్టు తెలిపారు. ఇరు దేశాల మధ్య యుద్ధానికి 20 శాతం అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే, వేగంగా ఎదుగుతున్న భారత్‌ను చూసి భయానికి గురైన స్థితిలో పాక్‌కు యుద్ధానికి దిగే అవకాశం ఉందని తెలిపారు. ఓ తప్పుడు అంచనా, రెచ్చగొట్టే చర్యలు, ప్రతిదాడులు.. ఓ భారీ ఉగ్రదాడి వంటివి పాక్, భారత్ యుద్ధానికి దారి తీయొచ్చని భావించారు. ఇందుకు కశ్మీర్ పరిస్థితులు కారణం కావొచ్చని కూడా అన్నారు భారత్‌పై ఉగ్రమూకలను రెచ్చగొట్టడమే పాక్ ప్రధాన వ్యూహమని కూడా సదరు సీఐఏ ఏజెంట్ చెప్పారు. అంతర్గత కుమ్ములాటలతో దేశం అస్థిరంగా మారిన పరిస్థితుల్లో ప్రజల దృష్టి మళ్లించేందుకు అక్కడి ప్రభుత్వం ఇస్లామిక్ పాలన వైపు కూడా మళ్లొచ్చని అన్నారు. ఇరు దేశాల మధ్య అణ్వాయుధ ప్రయోగ భయాలు ఎప్పటికీ ఉన్నవేనని అన్నారు. అయితే, పరిస్థితి చేయిదాటకుండా ఉండేందుకు పరస్పర విశ్వాసం పెంపొందించే చర్యలు చేపట్టాలని, నేరుగా చర్చల కోసం హాట్‌లైన్ ఏర్పాటుతో పాటు అణ్వాయుధాలపై ఒప్పందం అవసరమని అన్నారు. భారత్, పాక్ మధ్య తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ డాక్యుమెంట్ సంచలనంగా మారింది. ఇదిలా ఉంటే, భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు సద్దుమణిగేలా చేసేందుకు ఇప్పటికే ఇరాన్, సౌదీ అరేబియా ముందుకు వచ్చాయి. తాజాగా అమెరికా విదేశాంగ శాఖ మంత్రి కూడా భారత్, పాక్ మంత్రులకు ఫోన్ చేశారు.

# ఇదీ ఓ గెలుపేనా?: చంద్రబాబుపై జగన్ ఫైర్

మొదటి పేజి తరువాయి

అమరావతి : రాష్ట్రంలో ప్రస్తుతం సాగుతున్నది రాక్షస పాలన అని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పిఠాపురం, మార్కాపురం, కదిరి (గాండ్లపెంట), కుప్పం (రామకుప్పం) నియోజకవర్గాల నేతలతో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై ఆయన చర్చించారు.

### స్థానిక ఎన్నికల్లో అక్రమాలే తార్కాణం

ఇటీవల జరిగిన కొన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ వ్యవహరించిన తీరు అప్రజాస్వామికంగా ఉందని జగన్ ఆరోపించారు. మెజారిటీ స్థానాలు వైఎస్సార్సీపీ గెలుచుకున్నా, అధికార దుర్వినియోగం, బెదిరింపులు, డబ్బు ప్రలోభాలతో టీడీపీ పదవులను కైవసం చేసుకుందని విమర్శించారు. "సత్యసాయి జిల్లా గాండ్లపెంటలో ఏడు ఎంపీటీసీలకు ఆరు వైసీపీ గెలిస్తే, బెదిరించి ఎంపీపీ పదవి లాక్కున్నారు. మార్కాపురంలో 15కు 15 మనమే గెలిచినా, సూట్‌కేసు రాజకీయాలతో ప్రలోభపెట్టారు. పిఠాపురం మున్సిపాలిటీలో 30 మందికి 26 మంది మన కౌన్సిలర్లే అయినా, వారిని భయభ్రాంతులకు గురిచేశారు" అని జగన్ ఉదహరించారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కుప్పంలోనూ ఇదే దుస్థితి నెలకొందని ఆయన అన్నారు. "కుప్పం మున్సిపాలిటీలో 25 వార్డులకు 19 వైసీపీ గెలిస్తే, మా కౌన్సిలర్లను బెదిరించి, రూ. 50 లక్షలిచ్చి లాక్కుని ఛైర్మన్ పదవిని దక్కించుకున్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన వారే ఇలా చేస్తే ఎలా? బెదిరింపులు, ప్రలోభాలతో గెలిచారు... ఇది గెలుపా?" అని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థను సైతం టీడీపీ తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని, ఇంతటి ప్రతికూలతలోనూ నిలిచిన



కార్యకర్తల ధైర్యాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. గతంలో కొన్ని కారణాల వల్ల కార్యకర్తలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయామని అంగీకరించిన జగన్, రాబోయే 'జగన్ 2.0'లో కార్యకర్తలకు పెద్దపీట వేస్తామని భరోసా ఇచ్చారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఈ దుర్మార్గపు పాలనకు త్వరలోనే చరమగీతం పాడతారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ప్రధాని మోదీ ఏపీ పర్యటన షెడ్యూల్

మొదటి పేజి తరువాయి

అమరావతి, మే 1: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏపీలో పర్యటించనున్నారు. మే 2న రాజధాని అమరావతి పున: ప్రారంభకార్యక్రమంలో పాల్గొనేందుకు మోదీ ఏపీకి రానున్నారు. ఈ సందర్భంగా ఏపీలో మోదీ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఏ సమయంలో ఏపీకి రానున్నాను.. ఏయే ఏయే సమయాల్లో శంకుస్థాపనలు చేయనున్నారు.. ఎప్పుడు బహిరంగ సభలో ప్రసంగిస్తారో తెలియజేస్తూ షెడ్యూల్ విడుదలైంది. రేపు (మే2) మధ్యాహ్నం 2:55 గంటలకు మోదీ గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు. ఈ సందర్భంగా గన్నవరం విమానాశ్రయంలో మోదీకి మంత్రులు, కూమిటి నేతలు స్వాగతం పలుకనున్నారు. గన్నవరం ఎయిర్ పోర్ట్ నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 3:15 గంటలకు వెలగపూడి సచివాలయం వద్ద ఉన్న హెలిపాడ్‌కు పీఎం చేరుకుంటారు. హెలిపాడ్ వద్ద ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఘన స్వాగతం పలకనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు సభాస్థలికి చేరుకుని అమరావతి పున:ప్రారంభ కార్యక్రమంలో ప్రధాని పాల్గొననున్నారు. రాజధాని అమరావతిలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలతో పాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో కేంద్రం చేపట్టిన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఒక గంటా 15 నిమిషాల పాటు ప్రధాని మోదీ సభలో పాల్గొంటారు. కార్యక్రమం



అనంతరం సాయంత్రం 4:55 గంటలకు తిరిగి హెలికాప్టర్ ద్వారా గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు మోదీ. అక్కడి నుంచి విమానం ద్వారా ఢిల్లీకి వెళ్లనున్నారు.

ఆ స్టూడెంట్ ప్యాకేజ్ చూస్తే కళ్లు చెదరాల్సిందే..

### ప్రియాంక సక్సెస్ స్టోరీ

కాగా.. ప్రధాని కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే సచివాలయం వెనక ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు అన్నీ పూర్తి అయ్యాయి. మంత్రులు స్వయంగా అక్కడకు చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. సభా ప్రాంగణంలో ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నామన్నారు. సభా ప్రాంగణం అంతా సిద్ధం అయినట్లే చెప్పారు. పార్కింగ్ వద్ద కూడా ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు మంత్రులు చెబుతున్నారు. సభా ప్రాంగణానికి పెద్ద మొత్తం జనసమీకరణ జరిగేలా కూటమి నేతలు చూస్తున్నారు. ఈ సభకు 29 గ్రామాల ప్రజలు, రైతులను స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆహ్వానించినట్లు చెప్పారు. ప్రధాని సభకు దాదాపు 5 లక్షల మంది వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. రాజధాని ప్రజల కోసం ఎనిమిది వేల బస్సు.. రాజధాని చుట్టుపక్కల గ్రామాల ప్రజల కోసం ఆరువేలకుపైగా బస్సులను సిద్ధం చేశారు.

# మద్యం స్కాం కేసులో రాజ్ కసిరెడ్డి పీఏ అరెస్ట్

**మద్యం కుంభకోణం కేసులో దర్యాప్తు ముమ్మరం - సిట్ అదుపులో రాజ్ కసిరెడ్డి పీఏ పైలా దిలీప్**



అమరావతి : మద్యం కుంభకోణం కేసులో సిట్ దర్యాప్తు ముమ్మరం చేసింది. రాజ్ కసిరెడ్డి పీఏ పైలా దిలీప్‌ను అదుపులోకి తీసుకుంది. విదేశాలకు పరారయ్యేందుకు ప్రయత్నించిన పైలా దిలీప్‌ని చెన్నై ఎయిర్‌పోర్టులో పట్టుకుంది. పోలీసుల ముందు హాజరుకాకుండా తప్పించుకునేందుకు దిలీప్ విజయవాడ నుంచి చెన్నై వెళ్లాడు. అక్కడ నుంచి దుబాయ్ పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఫోన్ లోకేషన్ ఆధారంగా దిలీప్ కదలికలపై నిఘా పెట్టిన సిట్ బృందం చెన్నై ఎయిర్‌పోర్టులో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకుంది. దిలీప్‌ను రాత్రి విజయవాడకు తీసుకొచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడు రాజ్ కెసిరెడ్డి పీఏగా ఉన్న దిలీప్ వద్ద మద్యం కేసులో కీలక సమాచారం ఉన్నట్లు సిట్ బృందం భావిస్తోంది. సీఐడీ అధికారుల కస్టడీకి రాజ్ కసిరెడ్డి: మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డిని వారం రోజుల పాటు కస్టడీకి అనుమతిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది . ఈ నెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సిట్ అధికారులు కస్టడీకి తీసుకుని విచారించనున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విచారించుకునేందుకు సీఐడి అధికారులకు కోర్టు అనుమతినిచ్చింది. మద్యం కేసులో రాజ్ కసిరెడ్డిని 10 రోజుల కస్టడీకి కోరుతూ సీఐడి అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. నిందితుడి నుంచి కీలక సమాచారం రాబట్టాల్సి ఉందని ప్రభుత్వ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. మద్యం విక్రయాలు, కేటాయింపులు అన్నీ రాజ్ కసిరెడ్డి కనుసన్నల్లో జరిగాయని వాదించారు. మద్యం విక్రయాల్లో అక్రమంగా సంపాదించిన కోట్ల రూపాయలు ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టారు, ఏ విధంగా దారి మళ్లించారో తెలుసుకోవాలని అన్నారు. కుంభకోణంలో అంతిమ లబ్దిదారు ఎవరు అతనికి నగదు ఎలా చేరవేశారనే విషయాలు రాబట్టాల్సి ఉందని తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం వారం రోజుల కస్టడీకి అనుమతించింది. సిట్ అధికారులు రేపటి నుంచి కస్టడీకి తీసుకుని విచారించనున్నారు. రాజ్ కసిరెడ్డి ప్రస్తుతం విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

## సంపాదకీయం

# విద్యావిధానాన్ని రాజకీయం చేయకండి!

ప్రపంచంలో ఎన్నో దేశాల్లో అక్షర జ్ఞానం అడుగులు పడకముందే మనం నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాం. మన ఆచార వ్యవహారాలన్నింటిలో శాస్త్ర విజ్ఞానం నిగూఢంగా నిక్షిప్తమై ఉంది. ఇంతటి గొప్ప వారసత్వాన్ని సొంతం చేసుకున్న భారతీయ విద్య విదేశీ దండయాత్రలతో తన ప్రాభవం కోల్పోయింది. ముఖ్యంగా దాదాపు రెండు శతాబ్దాల ఆంగ్లేయుల పాలనలో మన విద్యా వ్యవస్థ తీవ్రంగా విధ్వంసమైంది. స్వాతంత్ర్యం వచ్చాక కూడా దురదృష్టవశాత్తూ ఆంగ్లేయులు అందించిన విద్యావిధానాలనే కొనసాగిస్తూ వచ్చాం. భారతీయతకు పెద్దపీట వేసి మనదైన సొంత విద్యావిధానాన్ని రూపొందించుకోవడంలో విఫలమయ్యాం. 1948లో స్వేచ్ఛాయుత భారతదేశ అవసరాలను తీర్చే విద్యా వ్యవస్థను నిర్మించే నిమిత్తం రాధాకృష్ణన్ కమిషన్ ఏర్పాటైంది. బ్రిటిష్, మెకాలే విద్యా విధానాలను రూపుమాపి, భారతీయ విలువలతో కూడిన విద్యావిధానం ప్రవేశపెట్టేందుకు మంచి అవకాశం ఈ కమిషన్‌కు లభించింది. కానీ, నాటి సామాజిక పరిస్థితులు, రాజకీయ సమీకరణాలు తదితర కారణాలతో అది సాధ్యపడలేదు. రాజ్యాంగ సభలో అధికార భాషపై చర్చ జరిగినప్పుడు హిందీని అధికారిక భాషగా ప్రకటించాలని చాలామంది సిఫార్సు చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ 'హిందుస్థానీ' (హిందీ, ఉర్దూ కలిసి ఉండే భాష)ని సూచించారు. చివరకు మున్షీ%-%అయ్యంగార్ ఫార్ములా ప్రకారం దేశంలో అత్యధిక మంది మాట్లాడే హిందీని అధికారిక భాషగా నిర్ణయించారు. హిందీతో పాటు ఒక పదేళ్ల వరకు ఇంగ్లీష్‌ను కూడా అధికార భాషగా అమలు చేయాలని, పదేళ్ల తర్వాత కేవలం హిందీని అధికార భాషగా కొనసాగించాలని నిర్ణయించారు. పదేళ్ల అనంతరం 1958 ప్రాంతంలో హిందీయేతర రాష్ట్రాల్లో ముఖ్యంగా తమిళనాడులో హిందీ వ్యతిరేక ఆందోళనలు జరిగాయి. అదే సమయంలో ఉత్తర భారతదేశంలో 'అంగ్రేజీ హటావో' నినాదాలు మిన్నంటాయి. ఈ నేపథ్యంలో నాటి ప్రధాని నెహ్రూ 1961లో రాష్ట్రాల ముఖ్యమంత్రులతో 'చీఫ్ మినిస్టర్స్ కాన్ఫరెన్స్' నిర్వహించారు. ఆ కాన్ఫరెన్సులోనే త్రిభాష సూత్రం ప్రతిపాదన వచ్చింది. దాని ప్రకారం పదేళ్ల వరకే అని ముందుగా అనుకున్నప్పటికీ, ఇప్పటికీ అధికార భాషగా ఇంగ్లీషును కొనసాగిస్తూ వచ్చారు. త్రిభాష సూత్రం ప్రకారం హిందీ, ఇంగ్లీషుతో పాటు మరొక భాష, అంటే ఆయా ప్రాంతం మాతృభాషను సబ్జెక్టులుగా ప్రవేశపెట్టారు. నాడు నెహ్రూ ప్రవేశపెట్టిన త్రిభాషా సూత్రాన్ని నేడు మోదీ ప్రభుత్వం మరింత మెరుగుపరిస్తే, దానిని తప్పుబట్టడం అర్థరహితం. 1964లో ఏర్పాటైన కోఠారీ కమిషన్ 1966లో నివేదికను సమర్పించింది. దీని ఆధారంగా స్వతంత్ర భారతంలో 1968లో తొలిసారి జాతీయ విద్యావిధానం రూపొందించారు. 1986లో నాటి జాతీయ విద్యావిధానంలో కొన్ని సవరణలు తీసుకొచ్చారు. మరిన్ని మార్పుల కోసం 1990లో రామ్మూర్తి కమిటీ ఏర్పాటైంది. 2005లో ఏర్పాటైన నాలెడ్జ్ సెంటర్ ఆఫ్ ఇండియా 2009లో తన నివేదికను సమర్పించింది. ఇవన్నీ ఆంగ్లేయుల ఆలోచన విధానంలో జరిగిన ప్రయత్నాలే. వీటిలో విద్యలో భారతీయ మూలాలను పాదుకొల్పాలన్న దృక్పథం కొరవడింది. ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం వలస పాలకుల వాసనలను వదిలించుకునే దిశగా అనేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో భారతీయ విజ్ఞానానికి పెద్దపీట వేస్తూనే, ప్రస్తుత ఏఐ జనరేషన్ అవసరాలనూ తీర్చేలా, కస్తూరి రంగన్ నేతృత్వంలో విస్తృత సంప్రదింపుల తర్వాత నూతన జాతీయ విద్యా విధానం%-%2020 (ఎన్ఈపీ%-%2020)ను ప్రవేశపెట్టింది. మోదీ ప్రభుత్వం ఏం చేసినా తప్పుబట్టడమే పనిగా పెట్టుకున్న కొందరు సూడో మేధావులు, కొన్ని పార్టీలు యథావిధిగా ఎన్ఈపీ%-%2020 పైనా విమర్శలు ఎక్కుపెట్టాయి. త్రిభాషా సూత్రం, విద్యను కేంద్రీకృతం చేయడం, మతం రంగు పులమడం అన్న మూడు 'లోపాలు' వారికి ప్రధానంగా కనిపించాయి. త్రిభాషా సూత్రాన్ని బూచిగా చూపి, హిందీయేతర రాష్ట్రాలపై కేంద్రం హిందీని, సంస్కృతాన్ని రుద్దుతుందంటూ తప్పుడు ఆరోపణలతో ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొడుతున్నారు. త్రిభాష సూత్రం ప్రస్తుత ఎన్ఈపీ%-%2020 తీసుకొచ్చినదేమీ కాదు, గతంలో ఉన్న విధానమే. ఇంకా చెప్పాలంటే పాత పద్ధతిని మరింత మెరుగుపర్చింది. పాత విధానంలో హిందీ, ఇంగ్లీష్ తప్పనిసరి చేసి మాతృభాష కోసం మరొక భాషను ఎంచుకునే అవకాశం ఇస్తే, ఇప్పుడు కనీసం రెండు భారతీయ భాషలను తప్పనిసరి చేస్తూ ఏవైనా మూడు భాషలనూ ఎంచుకునే అవకాశం విద్యార్థులకు కల్పిస్తుంది. ఉదాహరణకు హైదరాబాదులో చదువుకునే ఒక బెంగాలీ విద్యార్థి ఇంగ్లీషుతో పాటు తెలుగు, బెంగాలీ భాషలను ఎంచుకోవచ్చు, లేదా హిందీ, తెలుగు, బెంగాలీ భాషలను ఎంచుకోవచ్చు. 3%-%8 ఏళ్ల వరకు మాతృభాషలోనే విద్యా బోధన జరగాలని ఎన్ఈపీ%-%2020 ప్రతిపాదిస్తుంది. మాతృభాషలో బోధన జరిగితే విద్యార్థి పాఠ్యాంశాన్ని తొందరగా, సమగ్రంగా అకళింపు చేసుకోగలుగుతాడు. ఇతర భాషలో బోధన జరిగితే విషయాలను అర్థం చేసుకోవడం కన్నా, భాషను అర్థం చేసుకోవడమే పెద్ద సవాలుగా మారుతుంది. ముప్పు ఎదుర్కొంటున్న గిరిజన భాషల్లోనూ విద్యా బోధన జరగాలనేది మోదీ ప్రభుత్వం ఆకాంక్ష. తద్వారా ఆయా గిరిజన విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థమవడమే కాకుండా, గిరిజన భాషను పరిరక్షించవచ్చు అనేది అభిప్రాయం. ఇప్పటివరకు ఇంగ్లీష్‌లోనే అందుబాటులో ఉన్న మెడిసిన్, ఇంజనీరింగ్ వంటి సబ్జెక్టులను సైతం భారతీయ భాషల్లోనూ తీసుకురావాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

# సరైన న్యాయం!

పుష్కరకాలం క్రితం ఒక మునిమాపు వేళ హైదరాబాద్ నగరంలో 18 మంది అమాయకుల ప్రాణాలు తీసిన బాంబు పేలుళ్ల ఉదంతాల్లో దోషులుగా తేలిన ఆరుగురు నిందితులకూ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రత్యేక న్యాయస్థానం విధించిన మరణశిక్షను ధ్రువీకరిస్తూ తెలంగాణ హైకోర్టు మంగళవారం వెలువరించిన తీర్పు బాధిత కుటుంబాలకు మాత్రమే కాదు, ఉగ్రవాద ఘటనలను వ్యతిరేకించే వారందరికీ ఊరటనిస్తుంది. నగరంలోని దిల్‌సుఖ్‌నగర్‌లో రెండుచోట్ల జరిగిన ఈ పేలుళ్లలో మరో 131 మంది గాయాల పాలయ్యారు. వారిలో చాలామంది ఈనాటికీ ఆ గాయాలు కలిగించిన శారీరక, మానసిక క్లేశాల నుంచి కోలుకోలేకపోతున్నారు. మరణశిక్ష పడిన వారిలో రియాజ్ భత్కల్ అనే ఉగ్రవాది ఇప్పటికీ పాకిస్తాన్‌లో తలదాచుకున్నాడు. ఈ పేలుళ్లకు పథకం పన్నడంతోపాటు అందుకు కావల్సిన నిధుల సమీకరణ, పేలుడు పదార్థాలు, మనుషుల్ని సమకూర్చుకోవటం వగైరాలకు సూత్రధారి రియాజే. ఏవో కొన్ని ఉగ్రవాద ఘటనల ద్వారా దేశంలో అల్లకల్లోలం సృష్టించవచ్చని, దేశాన్ని బలహీనపరచవచ్చని ఈ బాపతు ఉగ్రవాదులు కలలుగంటారు. ఉగ్రవాదం మామూలు ఉన్మాదం కాదు. అది ఎప్పుడు ఎక్కడ తన విషపుకోరలు చాస్తుందో... ఎవరిని కాటేస్తుందో అంచనా వేయటం కూడా అసాధ్యం. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద సంస్థలు అక్కడి సైన్యం, దాని గూఢచార విభాగం ఐఎస్ఐ సహకారంతో శిక్షణ శిబిరాలు నిర్వహించటం, యువకులను తప్పుడు మార్గానికి మళ్లించటం, సాధారణ ప్రజానీకానికి హాని కలిగించగల చర్యలకు ప్రేరేపించటం దశాబ్దాలుగా సాగుతోంది. ఆ సంస్థల ప్రేరణతో సొంతంగా ఉగ్రవాద సంస్థలను నెలకొల్పి భయోత్పాతాన్ని సృష్టించటం భత్కల్ లాంటివారికి లాభసాటి వ్యాపారంగా కూడా మారిందని దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల ఉదంతంపై చేసిన దర్యాప్తులో వెల్లడైంది. మంగళూరు సమీప ప్రాంతాల్లో రియాజ్ భత్కల్ భారీయెత్తున రియల్ ఎస్టేట్ వెంచర్లు నిర్వహించాడని, జిహాద్ పేరుతో దేశంలోనూ, వెలుపలా లక్షలాది రూపాయలు వసూలు చేసి సొంత ఖాతాలకు మళ్లించుకున్నాడని కూడా బయటపడింది. తమను తాము మత సంరక్షకులుగా చిత్రించుకోవటం, జిహాద్ చేస్తున్నామని మభ్యపెట్టడం భత్కల్ లాంటివారికి రివాజు. వీరి వలలోపడి అనేకమంది యువకుల జీవితాలు నాశనమయ్యాయి. జనసమ్మర్దంగల ప్రాంతాల్లో బాంబులుంచి సాధారణ పౌరుల ప్రాణాలకు హాని కలిగించే ఇలాంటి వారికి కఠినమైన శిక్ష విధించటం సమాజ శ్రేయస్సు కోసం తప్పనిసరి. ఈ పన్నెండేళ్ల కాలంలోనూ వీరు తమ చర్యలకు పశ్చాత్తాపం ప్రకటించటంగానీ, ఇకపై సత్ప్రవర్తనతో మెలుగుతామని గానీ ఎక్కడా చెప్పలేదు. వీరిలో పరివర్తనకూ లేదా సంస్కరణకూ అవకాశమే లేదని నిర్ధారణ కొచ్చినట్టు ఉన్నత న్యాయస్థానం చెప్పిందంటే ఈ నేరగాళ్లు ఎంత కరుడు గట్టిపోయారో అర్థమవుతుంది. ఉగ్రవాదులు మతం పేరు చెప్పుకోవచ్చుగానీ ఏ



మతమూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించదు. ఉగ్రవాదానికి అసలు మతం ఉండదు. ఇలాంటి నేరగాళ్ల చర్యల వల్ల మాత్రమే మతం సురక్షితంగా మనుగడ సాగించగలదని అందులోని వారెవరూ విశ్వసించరు కూడా! కానీ అమాయకులను నమ్మించటానికి వీరు మతాన్ని సాధనంగా వాడుకుంటారు. వారిని మభ్యపెట్టడం కోసం ఆధ్యాత్మి కతను ప్రబోధిస్తారు. క్రమేపీ తమ దురాలోచనను వారి మెదళ్లలోకి ఎక్కిస్తారు. అప్పటికల్లా ఆ యువకులు వీరి చేతుల్లో కీలుబొమ్మలుగా మారుతారు. ఇలాంటివారికి చివరకు మిగిలేదేమిటో, వారి మానసిక, శారీరక స్థితిగతులు ఎలా దిగజారతాయో తెలియటానికి జాతీయ న్యాయ విశ్వ విద్యాలయ విద్యార్థులు కొందరు వారితో మాట్లాడి రూపొందించిన నివేదికే సాక్ష్యం. భిన్న వర్గాల ప్రజల మధ్య చిచ్చురేపి దేశాన్ని విచ్ఛిన్నం చేయటానికీ, సమాజాన్ని భయభ్రాంతపరచటానికీ వీరు పాల్పడిన చర్యల వల్ల ఎక్కడెక్కడి నుంచో పొట్టకూటి కోసం ఈ మహానగరాని కొచ్చిన సాధారణ ప్రజానీకం బలయ్యారు. అందులో అన్ని మతాలవారూ ఉన్నారు. ఇంకా అమ్మ కడుపులోనే ఉన్న శిశువు మొదలుకొని స్త్రీలు, పిల్లలు కూడా వీరి మతిమాలిన చేష్టలకు బలైపోయారు. అనేకమంది జీవితాలు అనిశ్చితిలో పడ్డాయి. మనుషులైవుండి తోటి మనుషుల పట్ల ఇంత క్రూరంగా, ఇంత దారుణంగా వ్యవహరించటం ఊహకందనిది. ఇలాంటి ఉదంతాల్లో ఆచూకీ దొరక్కుండా సులభంగా తప్పించుకోవచ్చని, నేర నిరూపణ అసాధ్యమని నేరగాళ్లు భావిస్తుంటారు. కానీ సాంకేతికత బాగా పెరిగిన ఈ కాలంలో అదేమంత కష్టం కాదని పకడ్బందీ దర్యాప్తు ద్వారా ఎన్ఐఏ నిరూపించింది. అయితే ఇలాంటి కేసుల్లో ఇమిడివుండే సంక్లిష్టతల వల్ల కావొచ్చు... మన న్యాయస్థానాలకు ఉండే పెండింగ్ కేసుల భారం వల్ల కావొచ్చు విచారణకు సుదీర్ఘ సమయం పడుతోంది. ఈ ఉదంతం చోటుచేసుకున్ననాటినుంచీ చూస్తే ఇప్పటికి పన్నెండేళ్ల సమయం పట్టింది. త్వరితగతిన విచారించి శిక్షించే వ్యవస్థ ఉంటే అలాంటి బాటలో పోయేవారికి అదొక హెచ్చరికగా పనికొస్తుంది. ఈ తరహా భయోత్పాత చర్యలకు ఒక నిరోధంగా ఉపయోగపడుతుంది. అయితే ఈ ఉదంతంలో అయిన వారిని కోల్పోయినవారికీ, ప్రాణాలతో బయటపడి భారంగా బతుకీడుస్తున్నవారికీ ఇప్పటికీ ప్రభుత్వ సాయం అందలేదంటే మనసు చివుక్కుమంటుంది. కాళ్లూ చేతులూ కోల్పోయి, చూపు, వినికిడి దెబ్బతిని, కనీసం మందులు కొనే శక్తిలేక అనేకులు కష్టాలు పడుతుండటం కలచివేస్తుంది. ఈ విషయంలో ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించాలి.

# గవర్నర్లు ఈసారైనా గ్రహిస్తారా?


ఎన్నికైన ప్రభుత్వాలను బేఖాతరు చేస్తూ తరచు ఇబ్బందులు సృష్టించే గవర్నర్లకిది శరాఘాతం. శాసనసభ ఆమోదించిన పది బిల్లులపై ఆమోదముద్ర వేయకుండా, రాష్ట్రపతి పరిశీలనకు పంపకుండా దీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టిన తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తీరును తప్పుబట్టడమేకాక ఆ బిల్లులన్నీ ఆమోదించినట్టుగా భావిస్తూ సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం వెలువరించిన తీర్పు అసాధారణమైనది. రాజ్యాంగంలోని 142వ అధికరణ కింద తనకు దఖలు పడిన విశేషాధి కారాలను వినియోగించుకుని సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. తాము ఎన్నికైన ప్రభుత్వాల కన్నా అధికులమని భావించటం, వివాదాస్పద వ్యాఖ్యలు చేసి ప్రభుత్వాలను ఇరకాటంలో పెట్టడం చాన్నాళ్లుగా కొందరు గవర్నర్లలో కనిపిస్తున్న ధోరణి. తనముందుకొచ్చే ఈ మాదిరి కేసులపై విచారిస్తున్నప్పుడూ లేదా తీర్పు వెలువరించినప్పుడూ ఈ ప్రవర్తన సరికాదని సుప్రీంకోర్టు చెబుతూనే వచ్చింది. వేరే రాష్ట్రాలకు సంబంధించి తీర్పు వచ్చినప్పుడైనా తమ అధికారాలేమిటో, పరిమితు లేమిటో తెలుసుకుని మెలగటం, ప్రవర్తనను సవరించుకోవటం విజ్ఞత అనిపించుకుంటుంది. కానీ అదెక్కడా కనబడటం లేదు. అలాగని గవర్నర్లంతా ఈమాదిరిగానే ఉంటున్నారని అనుకోనవసరం లేదు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో వున్నచోట ఎలాంటి సమస్యలూ కన బడవు. వ్యక్తులుగా హుందాతనాన్ని ప్రదర్శించే గవర్నర్లు విపక్ష ప్రభుత్వాల ఏలుబడిలోని రాష్ట్రాల్లో సాఫీగా పనిచేసుకుపోతున్నారు. ఎటొచ్చీ కొందరు గవర్నర్లు మాత్రం వింత పోకడలు పోతున్నారు. తమిళనాడు శాసనసభ ఆమోదించి గవర్నర్ రవి వద్ద పెండింగ్‌లో వున్న పది బిల్లుల్లో జనవరి 2020 నాటిది కూడా ఉందంటే ఆశ్చర్యం కలుగుతుంది. అంతేకాదు... ఈ బిల్లుల్లో చాలాభాగం ఒకసారి అసెంబ్లీలో ఆమోదం పొంది గవర్నర్ తిరస్కారానికి గురై రెండోసారి అసెంబ్లీ ఆమోదం పొంది వచ్చినవి. రాజ్యాంగ నిబంధన ప్రకారం ఒక బిల్లు తన సంతకం కోసం వచ్చినప్పుడు గవర్నర్ దాన్ని ఆమోదించటమో, తిరస్కరించటమో, రాష్ట్రపతి పరిశీలనకు పంపడమో చేయాలి. అంతేతప్ప నెలల తరబడి తొక్కిపెట్టి వుంచ కూడదు. ఈ సంగతిని రెండేళ్లనాడు పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు వెలువరిస్తూ సుప్రీంకోర్టు తెలియజేసింది. అక్కడి గవర్నర్ ఏకంగా 12 బిల్లుల్ని దీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచారు. తన ఆమోదముద్ర కోసం వచ్చిన బిల్లుపై 'సాధ్యమైనంత త్వరగా' గవర్నర్ నిర్ణయం తీసుకోవాలని, పునఃపరిశీలన అవసరమని భావిస్తే ఆ సంగతి తెలియజేయాలని అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 200వ అధికరణ సైతం ఈ సంగతే చెబుతోంది. బిల్లు సక్రమంగా లేదని, స్పష్టత కొరవడిందని లేదా రాజ్యాంగ నిబంధనలను అతిక్రమిస్తోందని గవర్నర్ భావిస్తే దాన్ని తిప్పిపంపొచ్చు. గవర్నర్ ఇచ్చిన సలహాను అంగీకరించి బిల్లుకు సవరణలు చేయటమా లేక యథాతథంగా దాన్నే మరోసారి



ఆమోదించి పంపటమా అనేది శాసనసభ ఇష్టమని ఆ అధికరణ తేటతెల్లం చేస్తోంది. రెండోసారి వచ్చిన బిల్లును గవర్నర్ ఆమోదించి తీరాలని లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపాలని చెబుతోంది. నిబంధనలుఇంత స్పష్టంగా ఉన్నప్పుడు రవి ఇష్టానుసారం ప్రవర్తించటం అనుచితం. పంజాబ్ కేసులో ఇచ్చిన తీర్పును గవర్నర్లు బేఖాతరు చేస్తున్నారని గమనించటం వల్లే... ఆమోదం కోరుతూ తమ వద్దకొచ్చిన బిల్లు విషయంలో గవర్నర్లు ఎలా మెలగాలో తాజా తీర్పులో సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్దేశించాల్సి వచ్చింది. రాష్ట్రపతి పరిశీలనకు పంపదల్చుకున్న బిల్లుల్ని గరిష్ఠంగా మూడు నెలలు మించి తమవద్ద ఉంచుకోరాదని, పునఃపరిశీలనకొచ్చిన బిల్లునైతే వెంటనే ఆమోదించాలని లేదా గరిష్ఠంగా నెల రోజుల్లోపల సమ్మతి తెలపాలని ధర్మాసనం తెలిపింది. తొలిసారి వచ్చిన బిల్లుకూ, రెండోసారి పంపిన బిల్లుకూ వ్యత్యాసం ఉన్నపక్షంలో మాత్రమే ఇందుకు మినహాయింపు వుంటుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలకు అధికారాలుండాలి. కానీ ఆ ప్రభుత్వాలపట్ల ఏర్పర్చుకున్న అభిప్రాయంతో ఈ అధికారాలకు అవరోధాలు కల్పించాలని చూడటం రాజ్యాంగ ధిక్కరణ అవుతుందని గవర్నర్లు గ్రహించటం లేదు. అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ కేసులో 2016లో ఇచ్చిన తీర్పులో ఈ సంగతిని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తన ఆమోదం కోసం వచ్చిన బిల్లులపై 'సాధ్యమైనంత త్వరగా' నిర్ణయం తీసుకోవాలని పంజాబ్ కేసు విషయంలో సుప్రీంకోర్టు చెప్పినప్పుడే రవి అప్రమత్తమై తన పరిమితులను గుర్తెరిగి వుంటే తాజా తీర్పులో నిర్దిష్ట గడువు నిర్దేశించాల్సిన అవసరం ఉండేది కాదు. తమ ప్రవర్తనవల్ల రాజ్యాంగ పదవికుండే ఔన్నత్యాన్ని పలచన చేస్తున్నామని గవర్నర్లు ఇకనైనా గుర్తెరగాలి. కేంద్రంలో రాష్ట్రపతి మాదిరే రాష్ట్రాల్లో గవర్నర్లు కూడా రాజ్యాంగానికి అనుగుణంగా కొన్ని అధికారాలు, బాధ్య తలు కలిగివుంటారు. కానీ రాష్ట్రపతి తరహాలో వారు ఎన్నిక కారు. కేంద్ర కేబినెట్ సలహా మేరకు రాష్ట్రపతి వారిని నియమిస్తారు. రాజకీయ నాయకులు గవర్నర్లు కావటంవల్లే సమస్యలొస్తున్నాయని సుప్రీంకోర్టు భావించి భిన్నరంగాల్లో నిపుణులైనవారిని ఈ పదవికి ఎంపిక చేయాలని గతంలో సూచించింది. కానీ కేంద్రంలోని పాలకులకు నచ్చినవారే ఈ కోటాలో ఎంపికవుతారు గనుక ఆ నిపు ణులు రాజకీయాలకు అతీతంగా ఏమీవుండరు. రాజకీయంగా గవర్నర్లకు ఎలాంటి అభిప్రాయా లున్నా రాజ్యాంగ పదవిలో ఉంటున్నవారిగా అందుకు అనుగుణంగా మెలగటం నేర్చుకోవాలి. పదే పదే న్యాయస్థానాలతో చెప్పించుకోవటం మర్యాద కాదని తెలుసుకోవాలి.

# చెట్లు కుములుతున్న దృశ్యం

నగరం అప్పుడప్పుడే మేలుకుంటున్న వేళ డాబా మీదికి వెళ్ళి చూడండి: ఎప్పుడు మేలుకున్నాయో తెలియదు, ఎలా వచ్చాయో తెలియదు, చుట్టూ ఉన్న పెద్ద పెద్ద చెట్ల మీద, చిన్న చిన్న మొక్కల మీద, ఎక్కడబడితే అక్కడ చిన్నాపెద్దా పక్షులు, రంగురంగుల బుల్లి బుల్లి పిట్టలు! అవి నిర్విరామంగా కిచకిచల ధ్వనులు చేస్తూనే ఉంటాయి. అవి వాటితో అవి మాట్లాడుకోవడంబీ ఒకరి ఉల్లాసాన్ని ఒకరు పంచుకోవడంబీ కొమ్మమీంచి కొమ్మకు, ఆకుమీంచి ఆకుకు గెంతుతాయి,మందారపుష్పాల మెత్తని కేసరకాండాన్ని పట్టుకుని ఊగుతాయి. అది వాటి క్రీడావినోదం. అది కూడా కాసేపే! ఉషఃకాలపు పిల్లగాలులు చల్లచల్లగా వీస్తున్నప్పుడు, సూర్యుడు పూర్తిగా పొడుచుకు రానప్పుడు, పరిసరాలు వేడెక్కనప్పుడు, మరీముఖ్యంగా మానవ సంచారం మొదలవనప్పుడు! ఆ తర్వాత అవి అదృశ్యం! ఎక్కడికెడతాయో తెలియదు, రోజంతా ఎక్కడుంటాయో తెలియదు! వాటి గురించి ఎప్పుడైనా క్షణకాలం ఆలోచించి చూడండి, అప్పుడేమనిపిస్తుంది? బహుశా, ఎప్పుడో వేల సంవత్సరాల క్రితం మానవ ధూర్తరాష్ట్రులతో ఆడిన జూదంలో ఓడిపోయి జనారణ్యంగా మారిన తమదైన అరణ్యంలోనే అజ్ఞాతవాసం చేస్తున్న పాండవుల అనంత సంతతి కాదుకదా అనిపిస్తుంది. అవి రోజూ పొద్దుటే కాసేపు తమ కొమ్మల మీద, తమ ఆకుల మధ్య ఇంద్రధనువుల్ని ఆవిష్కరిస్తూ కోలాహలంగా తిరుగుతూ ఉంటే ఆ చెట్లకెంత సంబరం! ఆ చెట్లూ, పిట్టలూ ప్రకృతి చరిత్ర పుటల్లోని తమ గురించిన అధ్యాయాలను మనిషి నిర్దాక్షిణ్యంగా చెరిపేసి పూర్తిగా సొంత అధ్యాయాలతో నింపేసుకున్న తర్వాత, కేవలం ప్రాచీన స్మృతులుగా మారిన తమ అనుబంధం గురించిన ఊసులు ఆ కాసేపూ నెమరేసుకుంటాయి కాబోలు! పక్షులతో పోల్చితే చెట్ల పరిస్థితి మరీ ఘోరం. అవి ఎగరనూ లేవు, ఆపైన వాటివి భారీకాయాలు కనుక అజ్ఞాతవాసయోగం కూడా వాటికి లేదు. తమ కొమ్మల మీద, తమ వేళ్ళ మీద మనిషి గొడ్డలి వేటు ఏ క్షణంలో పడుతుందో నన్న నిత్యభయగ్రస్త జీవితాన్ని నిలువు కాళ్ళమీద గడపక తప్పదు. చెట్లు కూలుతున్న దృశ్యం గురించి, రాక్షసుని వెన్నెముకపై ప్రతిష్ఠించిన నగరం గురించి, నగరంలో మనిషి కంటక శరీరుడిగా మారడం గురించి, సర్వత్రా వినిపించే కఠోర శబ్దాలు,ధ్వంసక్రీడ, దగ్ధక్రీడల గురించి, పూల చెట్లు విలపించడం గురించి, నిద్రలో నడుస్తున్న మనిషి నెత్తుటి మడుగును దాటలేడని చెప్పి అవి శపించడం గురించి%-% కవి అజంతా రాస్తాడు. అవును, నిజమే, నిద్రలో నడుస్తున్న మనిషి ప్రకృతిలోని సమస్త జీవజాలం మనుగడనూ నెత్తుటి మడుగు చేశాడు, తను సృష్టించిన ఆ మడుగును



తను కూడా దాటలేని పరిస్థితిని తెచ్చుకుంటూనే ఉన్నాడు. ఒకప్పుడంతా అడవేనన్న సంగతి మరచిపోయి, నగరమే నిత్యమూ, సత్యమనే భ్రమలో పడిపోయాడు. చెట్లను కూల్చడం, వాటిని ఆశ్రయించుకున్న జీవజాలానికి నిలువనీడ లేకుండా చేయడమే అభివృద్ధి అని నిర్వచించుకుంటున్నాడు. తను కూడా భాగమైన ప్రకృతికి దూరమై ఒంటరివాడై పోతున్నాడు. అంతా తన ప్రయోజకత్వం, తానే భువికధినాథుడినని విర్రవీగుతున్నాడు. తను నెత్తిన మోసే తన పౌరాణిక, ఇతిహాస వారసత్వం నుంచి కూడా మనిషి పాఠాలు నేర్చుకోవడం లేదు. ఎగిరే పర్వతాల గురించి, మానవరూపం ధరించి మాట్లాడే నదుల గురించి, మాట్లాడే పక్షులు, జంతువుల గురించి అవి చెబుతాయి. అది, నువ్వు కూడా ప్రకృతిలో భాగమే సుమా అని గుర్తుచేయడంబీ ప్రకృతిలో ఏ జీవీ ఎక్కువా కాదు, తక్కువా కాదు, అన్నింటికీ జీవించే హక్కు ఉందని చెప్పడం! డవులకు, అక్కడి సమస్త పాణులకు రక్షణ కల్పించవలసిన అవసరం గురించి అర్థశాస్త్రం చెబుతుందిబీ అడవులూ, వాటిని ఆశ్రయించుకుని బతికే జీవులూ రాజ్యంలో భాగం కాని, స్వతంత్ర అస్తిత్వాలన్న సంగతిని ఆనాటి రాజుల వివేకం చెబుతుంది. ప్రాకృతికమైన పూర్తి అవగాహనతో పూర్వులు గీసిన ఈ లక్ష్మణ రేఖలన్నీ ఏమైపోయాయి? అడవిపై విచక్షణా రహితమైన రాజ్యపు రాబందు రెక్క పరచిందెవరు?! సమకాలీన శాస్త్రవిజ్ఞాన పాఠాలు కూడా మనిషి తలకెక్కడం లేదుబీ ఈ విశ్వమూ, భూమీ,అందులోని ప్రకృతీ తమవైన ప్రణాళికను, తమవైన కేలండర్‌ను అనుసరిస్తాయనీ, మనిషి ప్రణాళికలనూ, కేలండర్‌నూ అవి ఏ క్షణంలోనైనా కుప్పకూల్చగలవనే ఎరుక లేదు. వందల కోట్ల సంవత్సరాల భూమి చరిత్రలో ఎన్నో మంచుయుగాలు దొర్లాయి. భూకంపాలు, వరదలు, అగ్నిపర్వత విస్ఫోటాలు జీవి మనుగడను ఎన్నో మలుపులు తిప్పాయి. ఎంతో చరిత్రను తిరగరాశాయి. జీవపరిణామం ఎన్నో మార్పులు చెందింది. మానవ పరిణామంలో ఇప్పుడు చూస్తున్నదే తుది అంకం కాదు, మరిన్ని అంకాలకు అవకాశముందని జన్యుశాస్త్రజ్ఞులు హెచ్చరిక. మరి జంతువులు సహా ఇతర జీవజాలం సంగతేమిటి? మనిషిలోలానే వాటిలో కూడా ఏదైనా ఉత్పరివర్తన జరిగి అవి మనిషి స్థానాన్ని ఆక్రమిస్తే?! అది ప్రస్తుతానికి విపరీత ఊహలా అనిపించవచ్చు, కానీ ప్రకృతి గర్భంలో ఏ రహస్యాలు దాగున్నాయో ఎవరికి తెలుసు? కనుక మనిషి నేర్చుకోవలసింది వినమ్రత! ప్రకృతిపట్లా, అందులోని చరాచరాలన్నిటిపట్లా సమభావం, సమరసభావం!! పగబట్టి తిరగబడే ప్రకృతి ముందు తను పిపీలకమన్న ఆత్మజ్ఞానం!!

# వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

ఇటీవల దారుణహత్యకు గురైన టీడీపీ అధికార ప్రతినిధి వీరయ్య చౌదరి

స్థానిక ఎమ్మెల్యేతో కలిసి వీరయ్య చౌదరి ఇంటికి వెళ్లిన సునీత

ఈ దారుణానికి పాల్పడ్డ వారికి తగిన శిక్ష తప్పదన్న సునీత





ప్రకాశం : వారం రోజుల క్రితం దారుణహత్యకు గురైన టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి కుటుంబాన్ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శించారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గం నాగులుప్పులపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరిని వారం రోజుల క్రితం కొందరు వ్యక్తులు దారుణంగా పొడిచి చంపారు. ఈనేపథ్యంలో గురువారం పరిటాల సునీత సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్.విజయకుమార్ ఇతర నాయకులతో కలిసి వీరయ్య చౌదరి ఇంటికి వెళ్లారు. అక్కడ వీరయ్య చౌదరి చిత్ర పటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. వీరయ్య చౌదరి కుటుంబం తెలుగుదేశం పార్టీకి ఎంతో చేసిందని కచ్చితంగా ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అలాగే ఈ దారుణానికి పాల్పడిన వారిని ప్రభుత్వం వదిలిపెట్టదని.. కచ్చితంగా వారికి తగిన శిక్ష పడుతుందని ఎమ్మెల్యే సునీత అన్నారు...

# కార్మికుల చట్టాలు సక్రమంగా అమలు చేయాలి...

టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మే డే...

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

కార్మికుల ఐక్య పోరాటాలతో సమస్యలు పరిష్కారం – టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్ ...



కామారెడ్డి : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్ మెయిన్ రోడ్డులో గల టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యాలయంలోని టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మేడే కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్ జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికులందరూ ఐక్యంగా ఉండి పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఈ మధ్యకాలంలో వార్తలు బలంగా రాస్తున్న సందర్భంగా, అక్రమాలను నిజాయితీగా బయటకు వెలుగులోకి తీసుకువస్తున్న సందర్భంలో జర్నలిస్టులపై దాడులు చేయడం మామూలు విషయంగా మారిపోయిందని దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోవడంతో దుండగులు జర్నలిస్టులపై రెచ్చిపోతున్నారని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే జర్నలిస్టులకు నేటి రోజుల్లో విలువ లేకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి కరుణాకర్ మాట్లాడుతూ ఇక కార్మికుల శ్రమ దోపిడీ ఎప్పుడూ జరుగుతూనే ఉందని వారికి సుప్రీంకోర్టు అమలు పరిచిన సరైన చట్టాలు అమలుపరచడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కార్మికుల త్యాగ ఫలితంగానైనా వారికి సరైన న్యాయం జరగాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం టిడబ్ల్యూజేఎఫ్ నేషనల్ కౌన్సిల్ మెంబర్ శీర్లవంచ కృష్ణమాచార్యులు మాట్లాడుతూ మే డే అంటేనే కార్మికుల పండగ అని, కార్మికులు తమ హక్కులు సాధించుకున్న రోజు మేడే అని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు కార్మికులు ఎన్నో రోజుల నుండి పోరాడి సాధించుకున్న తమ హక్కులను కాలరాస్తున్నాయన్నారు. తమ హక్కులను సాధించుకునేందుకు కార్మికులందరూ ఐక్యంగా ఉండి పోరాడాలని ఈ సందర్భంగా కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు బి.ప్రవీణ్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కే.కరుణాకర్, టిడబ్ల్యూజేఎఫ్ నేషనల్ కౌన్సిల్ మెంబర్ శీర్లవంచ కృష్ణమాచార్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాకూరి మోహన్, ఎలక్ట్రానిక్ మీడియా కో కన్వీనర్ దశరథ్, జిల్లా ఉపాధ్యక్షుడు జమాల్పూర్ లక్ష్మణ్, కోశాధికారి రాములు, జాయింట్ సెక్రెటరీ సంజీవ్, సభ్యులు బంగారి, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు ఇబ్బందులు తలెత్తితే న్యాయ సేవ అధికార సంస్థ న్యాయం చేస్తుంది -

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి...



కామారెడ్డి : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కామారెడ్డి ఆధ్వర్యంలో నేడు అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రాంగణంలో న్యాయ చైతన్య సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్షక, కార్మిక లోకానికి మే డే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులకు ఏవైనా ఇబ్బందులు తలెత్తినపుడు సంబంధిత అధికారులకు సంప్రదించాలి లేదా మా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదిస్తే మేము కార్మికుల పక్షాన నిలబడి సరైన న్యాయం జరిగేలా చేస్తామన్నారు. ఉచిత న్యాయ సహాయం ద్వారా ఉచిత న్యాయవాదిని కూడా నియమిస్తామన్నారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన అసిస్టెంట్ కమీషనర్ అఫ్ లేబర్ డిపార్ట్మెంట్ ఎం. కోటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికుల చట్టాలను మరియు హక్కుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం నాగరాణి కార్మికులకు వారు పొందిన ట్రైనింగ్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సయ్యద్ ఖమ్రుద్దీన్, స్టేట్ జాయింట్ సెక్రటరీ తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ యూనియన్ ఖలీల్, బిఎన్ఆర్ కెవిస్ స్టేట్ జనరల్ సెక్రెటరీ సాయి కుమార్, బార్ అసోసియేషన్ కామారెడ్డి వైస్ ప్రెసిడెంట్ మురళి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది శ్రీనివాస్ రావు, మాయా సురేష్, జిల్లా న్యాయ సేవాధికార సిబ్బంది మరియు కామారెడ్డి లేబర్ డిపార్ట్మెంట్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

# పోలీసులు ప్రజల అవసరాలకనుగుణంగా పని చేయాలి...

విధుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలి.

డయల్ -100 కాల్స్ కు బ్లూ కోల్ట్స్ సిబ్బంది వెంటనే స్పందించాలి...

ఆన్లైన్ బెట్టింగ్స్, సైబర్ క్రైమ్ పై ప్రజల్లో అవగాహన పెంచాలి...

నసుల్లాబాద్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర...



కామారెడ్డి : గురువారం నాడు ఉదయం జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర కామారెడ్డి జిల్లా నసుల్లాబాద్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించి స్టేషన్ రికార్డ్స్ ను, రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్ టీమ్, ఎస్ హెచ్ వో, మెన్ రెస్ట్ రూమ్ , లాక్ అప్ రూమ్, స్టేషన్ పరిసరాలు, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ లో సిబ్బంది నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్లోని పరిసరాలు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే డయల్ - 100 కాల్స్ కు వెంటనే స్పందించాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర నసురుల్లాబాద్ ఎస్సై కి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. సరిగ్గా బ్లూ కోల్ట్, పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయాలి. విధుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ఆన్లైన్ బెట్టింగ్స్, సైబర్ క్రైమ్ పై ప్రజల్లో అవగాహన పెంచాలి. సిబ్బంది వారికి కేటాయించిన గ్రామలకు సంబంధించి పూర్తి సమాచారం సేకరించాలి, అదేవిధంగా తరచూ గ్రామాలను సందర్శించి సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాల పై, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాల పై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని ఎస్పి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

జాబ్ కార్డులున్న ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులకు రావాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,

రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లి గ్రామంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్

ఎం.బండమీదపల్లిలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీ.. ఉపాధి హామీ కింద చెరువులో పూడికతీత పనుల తనిఖీ.. ఫారంపాండ్ నిర్మాణం, పశువుల షెడ్డు ప్రారంభం.. పశువుల నీటితొట్టె పరిశీలన.. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి..

ఎస్డబ్ల్యుపిసి షెడ్డును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..





అనంతపురం, : జిల్లాలో గ్రామాలను స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పేర్కొన్నారు. గురువారం రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు.ముందుగా ఎం.బండమీదపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. లబ్ధిదారుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తెలపాలని, ప్రభుత్వం నుంచి ఏదైనా సహాయం అవసరమైతే చేస్తామని లబ్ధిదారులకు తెలిపారు. అనంతరం గ్రామ పరిధిలోని లాలాసాహెబ్ పల్లి వద్దనున్న చెరువులో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పూడికతీత పనులను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. స్వయంగా గడ్డపార చేతబట్టి జిల్లా కలెక్టర్ ఉపాధి పనులు చేశారు. రోజుకు ఎన్ని క్యూబిక్ మీటర్ల పనులు చేయగలుగుతున్నారు, మంచినీరు ఇస్తున్నారా, నీడ ఏర్పాటు చేశారా, ఇతర వివరాలు, కూలీల సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు ఎక్కువ మంది కూలీలను తీసుకురావాలన్నారు. ఉపాధి పనులను చక్కగా చేయాలని, యావరేజ్ రేట్ పెరగాలన్నారు. కూలీలకు నీడ పెద్దగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉపాధి పనులు చేసేటప్పుడు ఏవైనా ప్రమాదాలు జరిగితే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకాలు తోడుగా ఉంటాయన్నారు. ఉపాధి పనులు చేస్తే రోజుకు 300 రూపాయలు వస్తుందని, గ్రామంలో ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు రావాలని, మీ చుట్టుపక్కల వారికి కూడా ఉపాధి పనులకు రావాలని కూలీలు చెప్పాలని జిల్లా కలెక్టర్ సూచించారు.తదనంతరం రైతు సాధిక్ వలీ తోటలో ఫారంపాండ్ నిర్మాణాన్ని జిల్లా కలెక్టర్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఆ తరువాత గ్రామంలో రైతు బి.గోవిందు నిర్మించుకున్న పశువుల షెడ్డును జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. 2.30 లక్షల రూపాయల అంచనాతో పశువుల షెడ్డును ఏర్పాటు చేయడం జరగగా, రైతుకు బహువార్షిక పశుగ్రాస క్షేత్రం (పెరీనియం ఫాడర్)ను ఇచ్చేలా చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామ చివరన ఏర్పాటు చేసిన పశువుల తొట్టెను తనిఖీ చేశారు. ఆ తరువాత గ్రామంలో ప్రజలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్రప్రదేశ్ సాధించడంలో భాగంగా జిల్లాలోని గ్రామాలను స్వర్ణ గ్రామాలుగా మార్చాలన్నారు. ఇందుకోసం గ్రామాల్లో గోశాలలు ఏర్పాటు, ఇంకుడు గుంతలు, ఫారంఫాండ్లు, పశువుల షెడ్లు, నీటి తొట్టెలు, బహువార్షిక పశుగ్రాస క్షేత్రం ఏర్పాటు, తదితరాలు ఏర్పాటు చేయడం జరుగుతోందని, వీటన్నింటి ద్వారా గ్రామాలను స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దవచ్చన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తెలియజేసిన విధంగా పేదల సేవలో ప్రభుత్వం కింద తరలివచ్చి ఇంటింటికి వెళ్లి పెన్షన్లను ఇవ్వడం, గ్రామ అభివృద్ధి పనులు చేస్తున్నామని, ఇందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి నెల ఒక నియోజకవర్గంలోని ఒక గ్రామంలో ఇంటింటికి వెళ్లి పెన్షన్లను అందిస్తున్నామని, ఈరోజు రాప్తాడు నియోజకవర్గంలోని బండమీదపల్లిలో పెన్షన్లను ఇంటి వద్దకే వెళ్లి అందించామన్నారు. గ్రామంలో పరిశుభ్రత ఇంకా మెరుగయ్యేలా చూడాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకం మానివేయాలని, మురికినీరు వెళ్లేందుకు కాలువలు ఉండాలని, గ్రామం గురించి, మీ చుట్టుపక్కలవారి గురించి ప్రజలంతా ఆలోచించాలన్నారు. వేసవికాలంలో 100 శాతం జాబ్ కార్డులున్న ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులకు రావాలని, పనులకు వెళ్తే ఆదాయం వస్తుందని, కూలీలంతా పనులకు వచ్చేలా చేయాల్సిన బాధ్యత ఎంపీడీవో, ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులపై ఉందన్నారు. ఉపాధి పనులు చేయడం ద్వారా భూగర్భజలాలు పెరుగుతాయని, ఎక్కువ పంటలు పండించే అవకాశం ఉంటుందన్నారు. హార్టికల్చర్ లో మామిడి తోటల పెంపకాన్ని మరింత ఎక్కువ ప్రోత్సహిస్తామని, ఉపాధి హామీ కింద ఉద్యాన పంటల మొక్కలు అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరి ఇంటి వద్ద ఇంకుడు గుంత ఉండాలని, పొలాల్లో ఫారంపాండ్ ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఇంటి వద్ద పశువులు ఉండాలని, వాటి నుంచి ఆదాయం వస్తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కువగా చిత్తూరు జిల్లాలో గోశాలలను ఏర్పాటు చేయగా, రెండవ స్థానంలో అనంతపురం జిల్లాలో 1,400 పైగా గోశాలలను ఏర్పాటు చేశామని, వాటిని ఇంకా ఎక్కువగా చేపడుతామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బండమీద పల్లి నుంచి లాలాసాహెబ్ పల్లి వరకు తారు రోడ్డు నిర్మించాలని, ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని, పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు గ్రామానికి రోడ్డు మంజూరు చేస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. చివరగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రం (ఎస్డబ్ల్యుపిసి షెడ్డు)ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డ్వామా పిడి సలీమ్ భాష, డిపిఓ నాగరాజునాయుడు, జిల్లా పరిషత్ సీఈవో రామచంద్రారెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కల్యాణి, డిఎల్డిఓ లాలితాబాయి, తహసీల్దార్ విజయ కుమారి, ఎంపిడిఓ విజయలక్ష్మి, డిఎల్పిఓ విజయ కుమార్, సర్పంచ్ పద్మావతి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# “మే డే” ప్రపంచ కార్మికుల పోరాట దినం.



గాజువాక :: విశాఖపట్నం జిల్లా గాజువాక 67వ వార్డు సిపిఎం పార్టీ శాఖ మరియు సిఐటియు మరియు వివిధ ప్రజా ఉద్యమ సంఘాలు ప్రతినిధులు తో ప్రపంచ కార్మిక వర్గ చరిత్రను లిఖించిన దినముగా పిలవబడే మేడే సందర్భంగా.. కామ్రేడ్ కే కిరీటం అధ్యక్షతన కామ్రేడ్ కేపీ కుమార్ పర్యవేక్షితమైన కామ్రేడ్ సంతోషం సూచనలతో ఈరోజు ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాలలో వివిధ కార్మిక సంఘాలు కార్మికులతో సిఐటియు పతాకావిష్కరణ జరిగినట్లు శాఖా కార్యదర్శి కామ్రేడ్ లక్ష్మణస్వామి పాలూరు తెలియజేశారు. మొదటగా 67వ వార్డు జోగవాణిపాలెం సచివాలయం వద్ద జీవీఎంసీ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు మస్టర్ పాయింట్ వద్ద “మే డే” జెండా సీనియర్ పారిశుద్ధ్య కార్మికుల చేతుల మీదుగా ఎగరవేయడం జరిగింది ఇక్కడ కార్యక్రమం ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు సాగింది ఈ కార్యక్రమంలో జీవీఎంసీ వివిధ రకాల కార్మిక సంఘ నాయకులు మరియు కార్మికులు పాల్గొనడం జరిగింది. కొత్త గాజువాక బస్ స్టాప్ దగ్గర వివిధ ఫ్రూట్స్ మర్చంట్స్ మరియు కళాశీల ఆధ్వర్యంలో “మే డే” జెండా సీనియర్ “ఫ్రూట్స్ మర్చంట్” గొలుగు రామిరెడ్డి చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఫ్రూట్స్ మర్చంట్స్ చిన్న రెడ్డి , శ్రీను , గంగాధర మరియు “మేస్త్రీలు” అప్పలనాయుడు రాజారావు నాగేశ్వరరావు రమణగారు తదితరులతోపాటు కొన్ని పదుల మంది కళాసిలు పాల్గొనడం జరిగింది అంతేకాకుండా ఈ కార్యక్రమానికి శాఖ నాయకులతో పాటు గాజువాక జోన్ నాయకులు కామ్రేడ్ లోకేష్ కామ్రేడ్ ఎల్ బంగారు నాయుడు మొదలగువారు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమం 8 గంటల 30 నిమిషముల నుండి 10 గంటల వరకు ఉత్తేజపూరితమైన పాటలతో కార్యక్రమం జరిగింది. సాయిరాం నగర్ స్వామి విద్యానికేతన్ దరి ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 67వ వార్డు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గాజువాక జోన్ శాఖ సభ్యులు లోకేష్ మరియు బంగారు నాయుడు, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు తుంపాల శ్రీరామ్ మూర్తి , మధు మాస్టర్ , అంబులెన్స్ యూనియన్ నాయకులు రాజయ్య, శాఖ ప్రతినిధులు కుమార్ , కిరీటం , సంతోషంగారు, గోవింద , లక్ష్మణ స్వామి మరియు ఆక్సిలరీ శాఖ సభ్యులు కృష్ణవేణి , కళ్యాణి ప్రాంత నాయకులు పాలూరు దేవి మరియు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నట్లు శాఖా కార్యదర్శి కామ్రేడ్ లక్ష్మణ స్వామి పాలూరు తెలిపారు. ప్రధానంగా ఎనిమిది గంటలు పని నిలబెట్టుకోవడం ఒక సవాల్ లేబర్ కోడ్లు అమలు కాకుండా అడ్డుకోవడం మరో సవాల్ ఈ రెండు సవాల్ వ్యతిరేకంగా పోరాడడానికి యావత్ కార్మిక వర్గం ఈ మేడే స్ఫూర్తితో ప్రతిని భూనాలని మరియు కార్మికులకు నష్టం కలుగజేసే చట్టాలను కష్టమైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను అడ్డుకోవాలి మరియు మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి అని సిఐటియు నాయకులు మాట్లాడినట్లు పి ఎల్ స్వామి గారు తెలిపారు .

# ఆయనో రాజకీయ రాబంధు

జగన్ పై మంత్రి సవిత ఫైర్

సింహాచలం ఘటన బాధాకరం...

పగోళ్లకు కూడా ఈ కష్టం రాకూడదు...

బాధితులకు అండగా నిలిచిన సీఎం చంద్రబాబు

ప్రమాదంపై విచారణకు ప్రభుత్వం ఆదేశం

బాధితులకు ఓదార్పు పేరుతో జగన్ శవ రాజకీయాలు

ఆయన హయాంలో ఎన్ని ఘటనలు జరిగినా స్పందించలేదు

బాధిత కుటుంబాలకు అండగా నిలవలేదు : మంత్రి సవిత



అమరావతి : జగనో రాజకీయ రాబంధు అని, శవ రాజకీయాలతోనే ఆయన రాజకీయ జీవితం సాగుతోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సింహాచలం ప్రమాదం చాలా బాధాకరమని, గోడ కూలిన ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడంతో గుండె తరుక్కుపోతోందని మంత్రి సవిత ఆవేదన వ్యక్తంచేశారు. పగోళ్లకు కూడా ఈ కష్టం రాకూడదని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని వెల్లడించారు. ఇప్పటికే మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.3 లక్షల చొప్పున సీఎం చంద్రబాబు ఎక్స్ గ్రేషియా ప్రకటించారన్నారు. అలాగే, మృతుల కుటుంబాల్లోని ఒకరికి దేవాదాయ శాఖలోని దేవాలయాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా మరణించిన వారి కుటుంబానికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు ప్రకటించిందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే తమ మంత్రులు అనిత, డోలా బాల వీరాంజనేయులు, అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ ఎం. భరత్, దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు ఘటనా స్థలానికి వెళ్లారన్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలిచారని, ఇప్పటికే ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణకు సీఎం చంద్రబాబు ఆదేశించారని అన్నారు. నివేదిక రాగానే, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మంత్రి సవిత స్పష్టంచేశారు.

## ఆనాడెందుకు పరామర్శించలేదు..?

ఆది నుంచి శవ రాజకీయాలు చేయడం జగన్ కు అలవాటైపోయిందని, రాజకీయ రాబంధులా మారాడని మంత్రి సవిత మండిపడ్డారు. సింహాచలంలో ఘటనకెళ్లి, బాధితులను ఓదార్చడం మానేసి, శవ రాజకీయాలకు తెరతీశాడన్నారు. సొంత జిల్లాలో అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి 40 మందికి మంది జల సమాధయ్యారని, పశువులు కొట్టుకుపోయాయని, వందలాది గ్రామాలు నీట మునిగాయని అన్నారు. ఇంత నష్టం జరిగినా...తీరిగ్గా వారం రోజుల పోయిన తరవాత వచ్చి, అంతా చూసుకుంటానని చెప్పి రూపాయి కూడా ఇవ్వకుండా ముఖం చాటేసిన ప్రబుద్ధుడు జగన్ అని అన్నారు. తిరుపతి రుయా ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక 112 మంది మృతి చెందితే, వారి కుటుంబాలకు జగన్ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. కల్తీ మద్యం ఘటనలో 27 మంది చనిపోయినప్పుడుగాని, విశాఖపట్నం హిందూస్తాన్ షిప్ యార్డులో క్రెయిన్ కూలిన ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలోగాని ఆరోజు జగన్ కు స్పందించలేదన్నారు. విశాఖ ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజ్ ఘటనలో బాధిత కుటుంబాలకు పైసా కూడా జగన్ ఇవ్వలేదని, కంపెనీ ఇచ్చిన నష్టపరిహారాన్ని తాను ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకున్న ప్రబుద్ధుడు ఆయనని అన్నారు. విజయవాడ వరద బాధితులకు రూ.కోటి ఇస్తానని చెప్పి ఆయన ముఖం చాటేయ్యలేదా..? అని మంత్రి సవిత ప్రశ్నించారు.

## రాజకీయ ఉనికి కోసమే శవ రాజకీయాలు

తండ్రి శవంతో ఒకసారి, గొడ్డలిపోటు బాబాయ్ హత్యకు గురైతే ఆయన శవంతో ఇంకోసారి రాజకీయాలు చేసి ప్రజల సెంటిమెంట్ తో జగన్ ఆడుకున్నాడని మంత్రి సవిత మండిపడ్డారు. సింహాచలం ఘటనతో మరోసారి శవ రాజకీయాలకు తెరతీశాడన్నారు. దు:ఖంలో ఉన్న బాధితులను ఓదార్చి అండగా ఉంటామని చెప్పకుండా శవ రాజకీయాలు చేయడం సరికాదన్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లూ జగన్ కు అహంకారం తలకెక్కి ఏ రోజూ రోడ్డు మీదకు రాలేదన్నారు. పొరపాటున వచ్చినా పరదాలు కప్పుకుని తిరిగాడన్నారు. ఏ ఘటనల్లోనూ బాధితులను పరామర్శించలేదన్నారు. ఇప్పుడు తన రాజకీయ ఉనికి కోసం శవ రాజకీయాల కోసం రోడ్డెక్కుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.హిందూ సంప్రదాయాలను తూ.చ. తప్పకుండా పాటించే వ్యక్తి సీఎం చంద్రబాబు అని మంత్రి సవిత తెలిపారు. జగన్ అందుకు విరుద్ధంగా వ్యవహరించారన్నారు. తిరుమల బ్రహ్మోత్సవాలకు ఏనాడూ తన సతీమణితో కలిసి పాల్గొనలేదన్నారు. జగన్ హయాంలో హిందూ దేవతల విగ్రహాలను ధ్వంసం చేశారని, అంతర్వేధిలో రథాన్ని దగ్ధం చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మాట్లాడుతున్నాడని మంత్రి సవిత మండిపడ్డారు.

# పాత కార్లపై జీఎస్టీ..

### తరుగుదల అనంతర నికర విలువ కంటే అధిక ధరకు విక్రయిస్తేనే..

న్యూఢిల్లీ: పాత లేదా వాడిన కార్లను విక్రయించే సందర్భంలో ఆర్జించిన లాభంపైనే జీఎస్టీ వర్తిస్తుం దని పన్ను నిపుణు లు చెబుతున్నారు. అంటే, వాహన ధరలో తరుగుదల సర్దుబాటు అనంతర నికర విలువ కంటే అధిక మొత్తానికి విక్రయించగా ఆర్జించిన లాభంపై జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. పాత లేదా వాడిన వాహనాల (ఎలక్ట్రిక్ వెహికిల్స్ సహా) విక్రయాలపై ఇకపై ఏకరీతిగా 18 శాతం జీఎస్టీ విధించాలని గత శనివారం సమావేశమైన జీఎస్టీ మండలి నిర్ణయించింది. ఆదాయం పన్ను చట్టం 1961లో సెక్షన్ 32 కింద తరుగుదలను క్లెయిమ్ చేసుకున్న రిజిస్టర్డ్ వ్యక్తులు లేదా విక్రేతలకు మాత్రమే ఇది వర్తిస్తుంది. ఒకవేళ ఒక వ్యక్తి మరో వ్యక్తికి పాత కారును విక్రయించిన సందర్భంలో మాత్రం జీఎస్టీ వర్తించదు. కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం..రిజిస్టర్డ్ వ్యక్తి లేదా విక్రేత ఎవరికైనా తన వాహనాన్ని రూ.15 లక్షలకు విక్రయించాడని అనుకుందాం. ఆ వాహనం అసలు ఖరీదు రూ.20 లక్షలు. కాగా, ఇప్పటికే కారుపై రూ.8 లక్షల తరుగుదలను క్లెయిమ్ చేశాడనుకుంటే, నికర విలువ రూ.12 లక్షలు అవుతుంది. ఈ సందర్భంలో వాహన విక్రయ ధర (రూ.15 లక్షలు), తరుగుదల అనంతరం నికర విలువ (రూ.12 లక్షలు) మధ్య వ్యత్యాసం రూ.3 లక్షలపై 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.రిజిస్టర్డ్ వ్యక్తి లేదా విక్రేత రూ.20 లక్షల కారుపై ఇప్పటికే రూ.8 లక్షల తరుగుదల క్లెయిమ్ చేసుకోగా రూ.12 లక్షల నికర విలువ చేసే కారును రూ.10 లక్షలకే విక్రయించాడనుకుంటే, ఈ సందర్భంలో నికర విలువ కంటే విక్రయ ధర తక్కువగా ఉంది కాబట్టి ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.

# గుడ్ న్యూస్.. నేటి బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే..

ఈ ఏడాది నవంబర్ నెలలో తులం రూ.84 వేలుగా ఆల్ టైమ్ రికార్డ్ నెలకొల్పిన పసిడి ధరలు కొన్ని రోజులుగా తగ్గుతూ వస్తున్నాయి. 25 డిసెంబర్ 2024న 22 క్యారెట్ల పసిడి ధర రూ.70,890 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 77,340 గా ఉంది. అయితే ధరలు తగ్గేందుకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ ధర పుంజుకుంది. ప్రస్తుతం డాలర్ రూ.85 వద్ద ట్రేడ్ అవుతోంది. దీంతో అమెరికా జారీ చేసే ట్రెజరీ బాండ్ల వ్యాల్యూ పెరిగింది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు బాండ్ మార్కెట్ వైపు మ్మొగ్గుచూపడంతో బంగారం ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. మరోవైపు అమెరికా నూతన అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో అంతర్జాతీయంగా గోల్డ్ మార్కెట్ పడిపోతూ వస్తోంది. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత రక్షణాత్మకమైన నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇది కూడా బంగారం ధరలు పడిపోయేందుకు తోడైంది.

# వరకట్న వేధింపులతో మహిళ ఆత్మహత్య...

కామారెడ్డి : భార్యాభర్తల గొడవ తీవ్ర రూపం దాల్చడంతో కోపంతో భార్య భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. కామారెడ్డి పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా%శీ% ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలానికి చెందిన పసుపులేటి సాయితో గత ఏడాది మార్చ్ 28న అదే గ్రామానికి చెందిన పసుపులేటి పూజితతో వివాహం జరిగింది. బ్రతుకుదెరువు కోసం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్ కాలనీలో జీవనం సాగిస్తున్నారు. గత కొన్ని రోజుల నుండి వీరిద్దరి మధ్య వేరే అమ్మాయితో ఫోన్లో మాట్లాడుతున్నాడని గొడవలు జరుగుతున్నాయి. తన భర్త ఏమైనా అక్రమ సంబంధం పెట్టుకున్నాడో ఏమోనని అనుమానం గొడవకు దారి తీసింది. పెళ్లి సమయంలో కట్న కానుకల విషయంలో అర ఎకరం భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానన్న పూజిత తండ్రి విషయంలో బుధవారం రాత్రి ఇద్దరి మధ్య తారాస్థాయిలో గొడవ జరగడంతో ఆ విషయాన్ని మనసులో ఉంచుకొని తన ప్రతి విషయంలో భర్త సాయి ఇబ్బంది పెడుతున్నాడని మనస్తాపం చెంది పూజిత గురువారం నాడు మధ్యాహ్నం బిల్డింగ్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుందని సిఐ తెలిపారు. మృతురాలి తండ్రి కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదుతో పూజిత భర్త స్థాయిపై కేసు నమోదు చేశామని తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు పూజిత మృతదేహాన్ని అప్పగించారని తెలిపారు.

# అనారోగ్యంతో మృతి చెందిన బాలిక పదవ తరగతిలో స్కూల్ ఫస్ట్...

రాజన్న సిరిసిల్ల : పది రోజుల క్రితం మరణించిన బాలిక పదవ తరగతిలో స్కూల్ ఫస్ట్ ర్యాంక్ ఘనతను సాధించింది. వివరాల్లోకి వెళితే.. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన ఆకుల నాగచైతన్య (15) అనే బాలిక అదే గ్రామంలో ప్రభుత్వ హై స్కూల్లో చదువుతుంది. ఏప్రిల్ 17 వ తేదీన అనారోగ్యంతో నాగచైతన్య మరణించడం బాధాకరమైన విషయం. బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో 510 మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్ గా గొప్ప ర్యాంకు సాధించి నిలిచింది. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు కన్నీటిపర్యంతం అయ్యారు.

# బంగారం కోసం మహిళపై అత్యాచారం? హత్య?



కామారెడ్డి : బంగారు ఆభరణాల కోసం ఓ మహిళను అత్యాచారం చేసి, హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించిన దుండగుల సంఘటన కామారెడ్డి మండలం నరసన్నపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన మహిళపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేసినట్లు గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. కామారెడ్డి మండలం నరసన్నపల్లి గ్రామానికి చెందిన చిదుర కవిత (35) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. బుధవారం నాడు సాయంత్రం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన కవిత రాత్రైన ఇంటికి తిరిగి రాకపోవడం గురువారం నాడు ఉదయం పొలంలో చెట్టుకు చీరతో ఉరివేసి వేలాడుతూ కవిత కనిపించింది. దుండగులు ఆమెను అత్యాచారం చేసి, హతమార్చి, బంగారు ఆభరణాలు, కాళ్ల కడియాలు అపహరించుకుపోయారనీ గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కవిత గొంతుపై గాయం ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం చేసి ఆత్మహత్యగా చిత్రీకరించి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆభరణాలు దోచుకెళ్లినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# స్పెషల్ 'ఉత్సవ్ ఎఫ్‌డీ' స్కీమ్‌తో 8.10 శాతం వడ్డీ.. డిసెంబర్ 31 గడువు.. రూ.5 లక్షలు జమ చేస్తే ఎంతొస్తుంది?




ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన ఐడీబీఐ బ్యాంక్ తమ కస్టమర్లకు అధిక వడ్డీ అందించేందుకు ఉత్సవ్ ఎఫ్డీ స్కీమ్ తీసుకొచ్చింది. ప్రత్యేక టెన్యూర్లపై గరిష్ఠ వడ్డీ రేట్లు కల్పిస్తోంది. అయితే, ఈ స్పెషల్ ఉత్సవ్ ఎఫ్డీ పథకాల గడువు డిసెంబర్ 31, 2024తో ముగియనుంది. 8.10 శాతం వడ్డీ కావాలనుకునే వారు ఆలోపు బుక్ చేసుకోవచ్చు. ఇందులో రూ.5 లక్షలు జమ చేస్తే ఎంతొస్తుందో తెలుసుకుందాం.మీరు మంచి వడ్డీ రేట్లు అందించే ఫిక్స్‌డ్ డిపాజిట్ల కోసం చూస్తున్నట్లయితే మీకు ఇంకో వారం రోజులే అవకాశం ఉంది. భారతీయ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఐడీబీఐ బ్యాంక్ ఉత్సవ్ ఎఫ్డీ పేరుతో తీసుకొచ్చిన స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీమ్స్ గడువు డిసెంబర్ 31, 2024తో ముగుస్తున్నాయి. ఈ స్పెషల్ ఎఫ్డీల ద్వారా జనరల్ కస్టమర్లతో పాటు సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీ రేట్లు కల్పిస్తోంది. మరి ఆ స్కీమ్స్ గురించి ఇప్పుడే మనం తెలుసుకుందాం.

**ఐడీబీఐ బ్యాంక్ స్పెషల్ ఎఫ్డీ వివరాలు..**

ఐడీబీఐ బ్యాంక్ ఉత్సవ్ ఫిక్స్‌డ్ డిపాజిట్స్ వివిధ టెన్యూర్లు కలిగి ఉంటుంది. 300 రోజులు, 375 రోజులు, 444 రోజులు, 700 రోజులు మెచ్యూరిటీ కాల వ్యవధులతో వస్తున్నాయి. ఈ స్కీమ్స్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు గడువు డిసెంబర్ 31, 2024తో ముగుస్తుంది.

**జనరల్ కస్టమర్లకు వడ్డీ రేట్లు ఇలా ఉన్నాయి..**

**300 రోజులకు 7.05 శాతం**
**375 రోజులకు 7.25 శాతం**
**444 రోజులకు 7.35 శాతం**
**700 రోజులకు 7.20 శాతం**

**సీనియర్ సిటిజన్లకు వడ్డీ రేట్లు ఇలా ఉన్నాయి**

**300 రోజులకు 7.55 శాతం వడ్డీ**
**375 రోజులకు 7.75 శాతం వడ్డీ**
**444 రోజులకు 7.85 శాతం వడ్డీ**
**700 రోజులకు 7.70 శాతం వడ్డీ**

**గరిష్ఠ వడ్డీ రేటుపై రూ.5 లక్షలకు ఎవరికి ఎంతొస్తుంది?**

సూపర్ సీనియర్ సిటిజన్లకు ఆయా టెన్యూర్లపై 0.15 శాతం ఎక్కువ వడ్డీ లభిస్తుంది. అంటే 555 రోజుల టెన్యూర్ పై 8.10 శాతం వడ్డీ లభిస్తోంది. జనరల్ కస్టమర్లకు 444 రోజులపై 7.35 శాతం వడ్డీ లభిస్తోంది. ఇందులో రూ.5 లక్షలు జమ చేస్తే మెచ్యూరిటీ తర్వాత చేతికి రూ. 5,44,500 వరకు వస్తాయి. అలాగే సూపర్ సీనియర్లకు అయితే 555 రోజులపై 8.10 శాతం వడ్డీ లభిస్తోంది. ఇందులో రూ.5 లక్షలు జమ చేస్తే మెచ్యూరిటీ తర్వాత చేతికి రూ. 5,61,800 వస్తాయి.

# హెచ్‌డీఎఫ్‌సీ స్కీమ్.. రూ. 10 వేల సిప్‌తో ఇలా చేతికి రూ. 8.83 కోట్లు.. కనీసం రూ. 100 ఇన్వెస్ట్ చేస్తే చాలు!

హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ కీలక ప్రకటన చేసింది. తన టాప్ 100 ఫండ్ పేరును మార్చేసింది. ఇప్పుడు అది హెచ్‌డీఎఫ్‌సీ లార్జ్ క్యాప్ ఫండ్‌గా మారుతుందని స్పష్టం చేసింది. వచ్చే సంవత్సరం నుంచి ఇది అమలవుతుందని వెల్లడించింది. లాంగ్ టర్మ్ క్యాపిటల్ కోసం.. లార్జ్ క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుందని.. అందుకే పేరు మార్చినట్లు తెలిపింది. ఈ స్కీం పూర్తి వివరాలు తెలుసుకుందాం.మ్యూచువల్ ఫండ్లలో లాంగ్ రన్‌లో మంచి రిటర్న్స్ వస్తాయన్న అంచనాతో చాలా మంది మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ఇక్కడ కాంపౌండింగ్ ఎఫెక్ట్ కారణంగా మంచి లాభాలు వస్తాయి. ఆరంభ సంవత్సరాల్లో పెద్దగా రిటర్న్స్ రాకపోయినా.. కాలం గడుస్తున్న కొద్దీ లాభాలు పెరుగుతుంటాయి. ఇక్కడ వడ్డీపై వడ్డీ, అసలుపై వడ్డీ వల్ల మంచి రాబడి వస్తుంది. మ్యూచువల్ ఫండ్స్ స్టాక్ మార్కెట్లకు ప్రత్యామ్నాయంగా చెప్పొచ్చు. ఇక్కడ కూడా మన డబ్బుల్ని పరోక్షంగా.. స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడమే. అయితే వేర్వేరు స్టాక్స్‌లో ఒకే ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది కాబట్టి రిస్క్ కాస్త తగ్గించుకోవచ్చు. ఇప్పుడు మనం హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ నుంచి ఒక బెస్ట్ స్కీమ్ గురించి తెలుసుకుందాం.అదే హెచ్‌డీఎఫ్‌సీ తాజాగా దీనిపై కీలక ప్రకటన వచ్చింది. ఈ ఫండ్ పేరు హెచ్‌డీఎఫ్‌సీ లార్జ్ క్యాప్ ఫండ్ అని మారుతున్నట్లు ప్రకటించింది. 2025, జనవరి 1 నుంచి ఈ మార్పు నిర్ణయం అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఇప్పటికే దీని గురించి..




యూనిట్ హోల్డర్స్‌కు నోటీసులో వెల్లడించింది.హెచ్‌డీఎఫ్‌సీ టాప్ 100 ఫండ్.. అనేది ఒక ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్. ఎక్కువ మొత్తం లార్జ్ క్యాప్ స్టాక్స్‌లోనే పెట్టుబడులు పెడుతుంటుంది. నిఫ్టీ 100 టోటల్ రిటర్న్స్ ఇండెక్స్ ఇక్కడ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉంది. ఈ ఫండ్ మేనేజర్లుగా రాహుల్ బైజాల్, ధ్రువ్ ముచ్చల్ ఉన్నారు. దీర్ఘకాలంలో మంచి లాభాలు కోరుకునే వారికి ఈ స్కీమ్ సెట్ అవుతుందని చెబుతున్నారు. ఇందులో 80 నుంచి 100 శాతం వరకు ఈక్విటీ, లార్జ్ క్యాప్ కంపెనీస్‌కు చెందిన ఈక్విటీ రిలేటెడ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌కు కేటాయించగా.. 0-20 శాతం వరకు ఇతర లార్జ్ క్యాప్ కంపెనీలకు వర్తిస్తుంది. ఇంకా స్వల్ప మొత్తం డెట్ సెక్యూరిటీల్లో, లో కూడా ఉంది.ఈ ఫండ్‌లో కనీసం రూ. 100 నుంచి కూడా ఇన్వెస్ట్ చేయొచ్చు. గరిష్ఠంగా పరిమితి లేదు. గత ఏడాది వ్యవధిలో ఇది సగటున 13.90 శాతం రిటర్న్స్ ఇచ్చింది. ఈ క్యాలెండర్ ఇయర్‌లో 11.75 శాతం వృద్ధి నమోదు చేసింది. ఈ ఫండ్ నికర ఆస్తుల విలువ రూ. 36587.24 కోట్లుగా ఉంది. ఇది నవంబర్ 30 వరకు డేటా ప్రకారం మాత్రమే. ఇక ఈ స్కీమ్ ప్రారంభించిన (1996) సమయంలో నెలకు రూ. 10 వేల సిప్ ప్రారంభించినట్లయితే.. ఇప్పటివరకు అది రూ. 8.83 కోట్లు అయ్యేది. సగటున ఇన్నేళ్లలో 18.75 శాతం రాబడి అందించింది.

# పేదల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఏ ఆపద వచ్చినా ఇంటి పెద్ద కొడుకు చంద్రబాబు అండగా ఉంటారు.**

**ఆసుపత్రిలో చికిత్స పొంది ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.17 లక్షల 73 వేలు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి.**

పుట్టపర్తి : పేదల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కొనియాడారు. ఆస్పత్రిలో చికిత్స పొంది లక్షలాది రూపాయలు వైద్య చికిత్సల ఖర్చు చేసుకొని ఆర్థికంగా చితికిపోయిన పలు కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయ చెక్కులను గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ పేదలకు జబ్బు చేస్తే రోగం నయం చేసుకోవడానికి లక్షలాది రూపాయలు ఆస్పత్రులకు చెల్లించలేని పేదలకు ప్రభుత్వం అండగా ఉండి వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం ఇచ్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో మంచి నిర్ణయాన్ని తీసుకున్నారని పేర్కొన్నారు. ఇంట్లో ఉన్న వారికి పెద్ద జబ్బు చేస్తే దాన్ని నయం చేసుకోవడానికి లక్షలాది రూపాయలు కార్పొరేట్ ఆసుపత్రులకు చెల్లించే పరిస్థితి ఉన్న నేటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ద్వారా మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తోంది అన్నారు అంతే కాకుండా కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది లక్షలాది రూపాయలు వెచ్చించి తీవ్రంగా నష్టపోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ఇంటి పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి




చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించి ఆ కుటుంబాలకు ఒక విశ్వాసాన్ని నమ్మకాన్ని భరోసాను కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఆపదలో అండగా నిలుస్తున్న ఇలాంటి మంచి నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిని ,ఇలాంటి మంచి కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు చిరకాలం గుర్తుపెట్టుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు పెద్ద కమ్మవారి పల్లి గ్రామానికి చెందిన దేవరేంటి చక్రవర్తికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 10 లక్షల రూపాయలు, వెంగళమ్మ చెరువు గ్రామానికి చెందిన బి గోపాల్ కి రూ.5 లక్షల 50 వేలు నల్లమాడ మండలం కుటాలపల్లికి చెందిన దుద్దుకుంట సోమశేఖర్ రెడ్డికి 2,13,406 ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చెక్కులను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి బాధిత కుటుంబాలకు అందజేశారు.

**టిడిపి సీనియర్ నాయకులు కీ శే డాక్టర్ శంకరప్ప కు ఎమ్మెల్యే ఘన నివాళి.**



పుట్టపర్తి మండలం మామిళ్ళ కుంట క్రాస్ లో గుడిపాటి శంకరప్ప వర్ధంతికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి హాజరయ్యారు. కీర్తిశేషులు డాక్టర్ శంకరప్ప సమాధి ఘాటు వద్ద ఎమ్మెల్యే పల్లె సింధూర పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడికి విచ్చేసిన టిడిపి నాయకులను కార్యకర్తలను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించారు. శంకరప్ప వర్ధంతి సందర్భంగా ఏర్పాటుచేసిన అన్న వితరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పట్టణ టీడీపీ కన్వీనర్ రామాంజనేయులు , రూరల్ మండల కన్వీనర్ విజయ్ కుమార్ ,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి ,టీడీపీ యువ నాయకులు రామారావు, లక్ష్మీపతి శ్రీరామ్ రెడ్డి, కొత్తచెరువు టిడిపి సీనియర్ నాయకులు సాలక్ గారి శ్రీనివాసులు ,పుల్లప్ప ,ఓబులేసు ,విజయ్, చెన్నకేశవులు, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, పై పల్లి శ్రీధర్ బద్రి తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి ఆశీస్సులతో పుట్టపర్తి ఆధ్యాత్మిక కేంద్రానికి పూర్వ వైభవం తీసుకొద్దాం


**కనీవినీ ఎరుగని రీతిలో పుట్టపర్తిని అభివృద్ధి చేద్దాం**

**సత్యసాయి ట్రస్టు సహకారంతో బాబా శత జయంతోత్సవాల నాటికి అత్యంత సుందర పట్టణంగా ముస్తాబు చేద్దాం**

**బెంగలూరు గ్రీన్ సిటి లాగా పుట్టపర్తి ని బ్యూటీ సిటి గా మారుద్దాం**

**బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తి నగర అభివృద్ధి పై పర్యాటక ,ఇరిగేషన్ ,మున్సిపల్ ,రెవిన్యూ ,ఆర్ దబ్లు ఎస్ అధికారులతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సమీక్ష.**

పుట్టపర్తి ఎ: భగవాన్ శ్రీ సత్య సాయి బాబా ఆశీస్సులతో ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తికి పూర్వ వైభవం తీసుకొద్దామని నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వ అధికారులకు సూచించారు. సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాల వేడుకల ఏర్పాట్లపై పుట్టపర్తి నగర అభివృద్ధి పనులపై గురువారం పుట్టపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుట్టపర్తి సుందరీకరణ పనులపై కాకినాడ నుంచి వచ్చిన ఆర్కిటెక్ ఇంజనీర్ గణేష్ ,టూరిజం జిల్లా అధికారి నర్సయ్య ,రెవిన్యూ తరపున ఇంచార్జి తహసిల్దార్ కళ్యాణ్ ,ఇరిగేషన్ ఎస్ ఈ విశ్వనాథ్ రెడ్డి , డి ఈ గంగాధర్ ,ఆర్ డబ్ల్యూఎస్ ,మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద ఇతర శాఖ అధికారులతో కలసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సమీక్ష నిర్వహించారు. ముందుగా ఆర్కిటెక్ ఇంజనీర్ గణేష్తో ఈ అభివృద్ధి పనుల డి పి ఆర్ ప్రాజెక్టుపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి నగరాన్ని సుందర పట్టణంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ ఏడాది నవంబర్ 23న జరిగే బాబా శతజయంతోత్సవాల నాటికి పుట్టపర్తి నగరంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్యంగా రూ 105 కోట్లతో చిత్రావతి రోడ్డు విస్తరణ తో పాటు నదీ పరివాహక ప్రాంతంలో అత్యంత సుందరీకరణ పనులు త్వరగా చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పుట్టపర్తి మున్సిపల్ పరిధిలో సుమారు 167 కోట్లతో అండర్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని అది త్వరగా మంజూరు అయ్యేలా ముఖ్యమంత్రి చంద్రబాబు తో పాటు పురపాలక శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్తానని వెల్లడించారు. అంతేకాకుండా పుట్టపర్తి నగర ప్రధాన రహదారులతో పాటు పుట్టపర్తికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రహదారులన్నీ అందంగా తీర్చిదిద్దే విధంగా ఆర్ అండ్ బి శాఖ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి వాటికి అవసరమయ్యే నిధుల కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు



.అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రసాదం ప్రాజెక్టు కింద మరియు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పుట్టపర్తి నగర అభివృద్ధికి సుమారు 864 కోట్ల నిధులు అవసరమవుతాయని ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కేంద్ర ,రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు ప్రత్యేక దృష్టి సాదిస్తానని తెలిపారు. సత్య సాయి ట్రస్ట్ సహకారంతో బాబా శతజయంతి వేడుకలకు పుట్టపర్తి నగర అభివృద్ధి తో పాటు వివిధ అభివృద్ధి



పనులు త్వరగా జరిగే విధంగా కృషి చేస్తానని తెలిపారు. శిల్పారామంలో చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటుతోపాటు మున్సిపల్ పరిధిలోని పుడ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 14 పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. పుట్టపర్తిని బ్యూటిఫుల్ సిటీగా బెంగళూరు గ్రీన్ సిటీ తరహాలో హాబీబియా మొక్కలు ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. సత్యసాయి ట్రస్టు సహకారంతో పుట్టపర్తి ప్రధాన రహదారులపై మహాత్ముల విగ్రహాల ఏర్పాటు ,ఇండోర్ స్టేడియం మ్యూజియం అదనపు మరుగుదొడ్లు త్రాగునీరు ఏర్పాటుకు ఆయా శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రతిపాదనలు పంపాలని కోరారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం పై ప్రత్యేక సాధించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పుట్టపర్తి నగరమంతా సోలార్ తో విద్యుత్ తెలుగులో ప్రత్యేక లైటింగ్ తో రంగురంగుల నగరంగా తీర్చిదిద్దే విధంగా చూడాలని కోరారు. చిత్రావతి చెక్ డాం ప్రత్యేకంగా నింపడానికి బుక్కు పట్నం చెరువు నుంచి నీటిని సరఫరా చేయడానికి రూ.3కోట్లతో నీటి ఎత్తిపోతల పథకం అమలుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆ శాఖ అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. ఆయా శాఖల సమన్వయంతో నిధులు మంజూరుకు డిపిఆర్ ప్రాజెక్టు తయారు చేయాలని ఇరిగేషన్ టూరిజం మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అంతకుముందు పుట్టపర్తి చిత్రావతి రోడ్డు చెక్ డాం హారతి ఘాట్ వద్ద నదీ పరివాహక ప్రాంతాలను ఎమ్మెల్యేతో పాటు అధికారులు పరిశీలించారు. గోదావరి పుష్కరాలు తరహాలో స్నానపు ఘట్టాలు మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. పుట్టపర్తి నగరాన్ని అత్యంత సుందర పట్టణంగా తీర్చిదిద్దే విధంగా మున్సిపల్ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని తెలిపారు. పుట్టపర్తిలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం తో నిండి ఉండి అపరిశుభ్రంగా ఉందని ఇలా లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. అదేవిధంగా చిత్రావతి రోడ్డు విస్తరణ చేస్తున్నందున ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇరిగేషన్ భూమిని ఆక్రమించుకొని నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారందరికీ నోటీసులు ఇచ్చి వాటిని త్వరగా తొలగించే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పుట్టపర్తి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, టిడిపి యువ నాయకులు పట్టణ కౌన్సిలర్ లక్ష్మీపతి రామారావు గంగాధర్ నాయుడు సామకోటి ఆదినారాయణ, మాజీ చైర్మన్ బీసీ గంగన్న బెస్త చలపతి, సురేష్ చౌదరి కృష్ణ ప్రసాద్, పైపల్లి శ్రీధర్ చౌదరి భద్రీ కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అల్యూమినియం సెంట్రింగ్ ప్యానెల్స్‌ను

# దొంగిలించిన దొంగల ముఠా అరెస్ట్...





శేరిలింగంపల్లి: మియాపూర్ పోలీస్ స్టేషన్ లో 20/4/2015,న మధ్య రాత్రి , బాచుపల్లి రోడ్డులో ఉన్న తమ ప్రాజెక్ట్ సైట్‌లోకి ప్రవేశించి సుమారు 7 లక్షల విలువైన అల్యూమినియం సెంట్రింగ్ ప్యానెల్స్‌ను దొంగిలించారని, నిర్మాణంలో ఉన్న ఒక ప్రాజెక్ట్ సైట్ మేనేజర్ నుండి ఫిర్యాదు అందింది. దీనిపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఈ రోజు నిర్మాణం లో ఉన్న బిల్డింగ్ వస్తువులను దొంగిలించే ఆడ, మగ దొంగల ముఠా ను పట్టుకొని అరెస్ట్ చేయడం జరిగింది,వారు దొంగతనం చేసిన అల్యూమినియం సెంట్రింగ్ ప్యానల్స్ లను, వారితో పాటు రెండు ఆటోలను సీజ్ చేసి ఆడ, మగ దొంగల ముఠా ను పోలీస్ వారు కోర్టుకు తరలించడం జరిగింది. ఈ కేసులో అరెస్టయిన ఏడుగురు నిందితులు రాత్రి సమయాల్లో హైదరాబాద్ మరియు చుట్టుపక్కల నిర్మాణంలో ఉన్న అన్ని ప్రముఖ ప్రాజెక్టుల వద్ద వస్తువులను దొంగిలించి నేరాలకు పాల్పడటం అలవాటు చేసుకున్నారు. నిందితుల్లో (7), ఏ-1 నుంచి ఏ-5 వరకు నేర చరిత్ర ఉన్నవారు, వీరు అందరు కలిసి హైదరాబాద్‌లోని సైదాబాద్‌లోని సింగరేణి కాలనీలో నివాసం ఉంటూ వివిధ గ్రూపులుగా ఏర్పడి ఈ తరహా ఆస్తుల అక్రమాలకు పాల్పడుతున్న పలువురు నిందితులు ఉన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల సైట్‌లు అమలులో ఉన్న ప్రాంతాలలో మరియు చుట్టుపక్కల ప్రతి సమూహం నుండి ఒక గైడ్ తిరుగుతూ అందుబాటులో ఉన్న మెటీరియల్‌లను జాబితా చేయండి, భద్రతా ఏర్పాట్లను ఆడిట్ చేయండి. టీమ్ లీడర్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించిన తర్వాత అర్ధరాత్రి సమయంలో సైట్ ను సందర్శించి విలువైన నిర్మాణ సామగ్రిని చోరీకి పాల్పడి వేర్వేరు ఏజెంట్ల ద్వారా పారవేస్తారు.వారు విధంగా దొంగతనాలకు పాల్పడుతుంటారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌ల పర్యవేక్షణ సిబ్బంది మరియు నిర్వాహకులు వారి బిల్డింగ్ వస్తులను, మెటీరియల్ ను నిఘా ఉంచాలని, సైట్‌లో మరియు చుట్టుపక్కల (మొత్తం ప్రాంగణాన్ని కవర్ చేసేలా) సి సి టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పోలీస్ వారు సూచించారు ఈ కేసు లో సైబరాబాద్‌లోని మాదాపూర్ జోన్ డీసీపీ డాక్టర్ వినీత్, ఐపీఎస్, ఆధ్వర్యంలో మియాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన క్రైమ్ మరియు ఎల్ అండ్ ఓ సిబ్బంది సంయుక్త కృషితో ఈ దొంగల ముఠా ను అరెస్టు చేయడం జరిగింది.



## శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 64 చెరువుల ను సుందర శోభిత వనంలు గా తీర్చిదిద్దుతాం....

మల్లిగవాడ్ ఫౌండేషన్ సేవలు అభినందనియం.

మన భవిష్యత్తు తరాలకు ఆస్తులు కాదు మంచి ఆరోగ్యం

,ప్రశాంత జీవితం ఇవ్వాల్సిన బాధ్యత మనందరి పైన ఉంది.

పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి.



శేరిలింగంపల్లి: మియపూర్ డివిజన్ పరిధిలోని గుర్నాథమ్ చెరువు సుందరికరణలో భాగంగా నెక్సస్ సెలెక్ట్ మల్స్ కంపెనీ వారి సి ఎస్సార్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టనున్న చెరువుల పునర్జీవనంలొ భాగంగా సుందరికరణ మరియు పునరుద్ధరణ పనులను హైడ్రా అధికారులతో కలిసి పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు

## ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలు పాలుగోన్న



## చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కట్ట వెంకటేష్ గౌడ్.

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలు జరుపుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కట్ట వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఎందరో మహానుభావులు జరిపిన పోరాట ఫలితంగా క కార్మిక లోకంలో చైతన్యం వెలువిరిసింది. అలనాటి దోపిడీ విధానాలను సమూలంగా మార్చుకొని కార్మికులు తమ హక్కులను సాధించుకున్న రోజు ఇది కార్మిక శక్తి లేనిదే సమాజం ముందుకెళ్లదు కానీ ఇప్పుడున్న ప్రభుత్వాలు నవరత్నలాంటి కంపెనీలను ప్రైవేటు ఇజం చేస్తూ కార్మికుల హక్కులను కాల రాస్తుంది ఇలాంటి విధానాలను విడనాడాలని కార్మిక లోకం కోరుకుంటుంది కానీ కార్మికుల హక్కులను కాలరాస్తూ నాయకులే మేడే వేడుకల్లో పాల్గొనడం ఆచార్యాన్ని కలిగిస్తుంది సందర్భాన్ని పురస్కరించుకొని ఇకనైనా అలాంటి విధానాలను విడ నాడాలని విజ్ఞప్తి చేస్తూ మరి ఒకసారి ప్రపంచ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను శేర్లింగంపల్లి నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్డులను వివిధ డివిజన్లో కోఆర్డినేటర్లకు అందజేయడం జరిగింది సభ్యత్వం పొందిన వారి సభ్యత్వ కార్డును వారి ఇంటి దగ్గరికి వెళ్లి అందజేయవలసిందిగా తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షులు చిట్టిబాబు బిఎస్ఎన్ కిషోర్ మరియు చేవెళ్ల పార్లమెంట్ అడక్ కమిటీ సభ్యులు గూడెపు రాఘవులు,మధుమోహన్ పోయిన సుబ్బారావు కోటేశ్వరరావు,రాకేష్ చౌదరి బాలాజీ,సుస్మిత,సునీత బాలాజీ మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## అనంతసాగర్ లోఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో పహల్గాం మృతులకు నివాళి




,సదాశివపేట: అనంతసాగర్ లో ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో పహల్గాం మృతులకు నివాళి : కొండాపూర్: పహేల్గాం లో పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు జరిపిన మారణ హెూమాన్ని నిరసిస్తూ అనంత సాగర్ లో తాజా మాజీ ఉప సర్పంచ్ ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో కుల మాతాలకు అతీతంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ పర్యాటకుల పై పాకిస్తాన్ ఉగ్ర వాదులు జరిపిన దాడి హేయమైందన్నారు. భారత్ పాకిస్తాన్ కు సరైన బుద్ధి చెప్పాలని కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్ ఉగ్రవాదులకు ఏరి పారేయాలి అన్నారు . ఈ కార్యక్రమంలో గ్రామంలో యువకులు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో గ్రామంలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# యువత రాజకీయాల్లో ఎదగడానికి అవకాశం ఉన్న ఏకైక రాజకీయ సంస్థ కాంగ్రెస్ పార్టీ..

దార్శనిక నాయకుడు సేవకు నిబద్ధత తెలంగాణ ప్రభుత్వానికి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి.

పనిచేస్తున్నారు,అందుకే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి మరియు రాజకీయాల నాణ్యత మెరుగుపడుతోంది అన్నారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్.



, శేరిలింగంపల్లి: టీపీసీసీ ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ కేఎల్సిసి కన్వెన్షన్ నందు నిర్వహించిన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ఏఐసీసీ సభ్యులు చల్లా వంశీ చంద్ రెడ్డి ,శ్రీ మధు యాష్కీ గౌడ్ ,స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి , జిల్లా కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులు, నియోజకవర్గ ఇంచార్జ్ లు,డివిజన్ అధ్యక్షులు,నియోజకవర్గ నాయకులతో కలిసి పాల్గొన్నారు శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలనకు నిదర్శనం కాంగ్రెస్ ప్రభుత్వం అని,కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తుందని,మాట ఇచ్చాం,చేసి చూపిస్తాం అని,అభివృదే ప్రధాన లక్ష్యంగా తాము ప్రజలకు,మైనార్టీలకు,బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటాం



అని కాంగ్రెస్ పార్టీకి సేవ చేసిన కార్యకర్తలకు న్యాయం చేస్తామని,ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ,మీతో నడుస్తాం అని అన్నారు శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ దేశానికి చేసిన సేవ ఎప్పటికీ మరువలేనిదని,కాంగ్రెస్ పార్టీ ముఖచిత్రం,భారత రాజకీయాల భవిష్యత్తు,దేశం పట్ల దార్శనికత కలిగిన,రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం ప్రజల కోసం నిజాయితీగా పనిచేసే రాహుల్ గాంధీ రాజకీయాల్లో మాకు ఆదర్శం,స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. ఇక మన రాష్ట్రానికి వస్తే మనకు శక్తివంతమైన నాయకత్వం ఉందని ముఖ్యమంత్రివర్యులు ఎ రేవంత్ రెడ్డి మరియు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఎల్లప్పుడూ కార్యకర్తకు అండగా ఉంటూ,కాంగ్రెస్ క్యాడర్ కు మద్దతు ఇచ్చి,ప్రోత్సహించే విధంగా ముందుకు సాగుతున్నారని అన్నారు.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చే ప్రతి పిలుపు కు అనుగుణం గా శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని,కాంగ్రెస్ పార్టీ ఇచ్చే ప్రతి పథకాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తూ,పార్టీ పిలుపును స్వీకరించి ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు..ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు,డివిజన్ అధ్యక్షులు,మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు ..

## శ్రమ జీవులందరికీ మేడే శుభాకాంక్షలు కంటెస్టెంట్ ఎమ్మెల్యే, కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్



శేరిలింగంపల్లి: శ్రమ జీవులందరికీ మేడే శుభాకాంక్షలు మీ అవిరళ కృషి, పట్టుదల, సమాజానికి వెన్నెముకలా నిలుస్తున్నాయి. మీ శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను కంటెస్టెంట్ ఎమ్మెల్యే, కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్. ఈరోజు గచ్చిబౌలి డివిజన్ లో ప్రపంచ కార్మికుల దినోత్సవ సందర్భంగా సానిటేషన్ ఎస్ ఆర్ పి నరసింహ ఆహ్వాన మేరకు కార్మికుల ఐక్యతను చాటుతూ జెండా ఆవిష్కరించి జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన జరిగింది. ఈ సందర్భంగా రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈరోజు ప్రత్యేకమైన రోజు, కార్మికుల హక్కుల కోసం పోరాడిన వారిని స్మరించుకుంటూ వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం మెరుగైన పని పరిస్థితులను అనుభవిస్తున్నాం. ఆ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ, అందరికీ సమానమైన అవకాశాలు, న్యాయమైన వేతనాలు, సురక్షితమైన పని వాతావరణం ఉండేలా ప్రభుత్వాలు, అధికారులు కృషి చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరి శ్రమ విలువైనది. చిన్నదైనా, పెద్దదైనా, ఏ పని చేసినా సమాజ అభివృద్ధికి తోడ్పడుతుంది. మీ మీరు చేసే పని మనసు పూర్తిగా గౌరవిస్తూ మీ హక్కుల కోసం, మీ కష్టసుఖాల కోసం కొట్లాడడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని మాట ఇస్తూ, ఈ మేడే రోజు మీ యొక్క జీవితాలలో కొత్త ఉత్సాహాన్ని, ప్రేరణను నింపాలని మీ శ్రమకు తగ్గ ఫలితం పొందాలని ఆశిస్తూ మరోసారి కార్మిక సోదరులందరికీ మేడే శుభాకాంక్షలు తెలుపుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి కంటెస్టెంట్ కార్పొరేటర్ ఎల్లేష్, నరసింహ, కిరణ్, అనిల్, రాజేష్ యాదవ్, శ్యామ్ రాజ్, శివ, నిర్మల , తిమ్మక్క మొదలగు వారు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో విద్యా హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ.

### - 500 పైగా మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులు




శేరిలింగంపల్లి : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించదంలో శేరిలింగంపల్లి మండలం, అంజయ్య నగర్ లో గల విద్యా హై స్కూల్ విద్యార్థులు తమకు తామే సాటి అని నిరూపించుకున్నారు. ఈ సంవత్సరం 40 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించడం తో పాటు 13 మంది విద్యార్థులు 600 కు గాను 500 కు పైగా మార్కులు సాధించి సత్తా చాటారు. మార్కెట్ లో పెరుగుతున్న పోటీని తట్టుకొని నిలబడి, కార్పొరేట్ స్కూల్స్ కు ఏ మాత్రం తీసిపోని విధంగా ఫలితాలు సాధించి చూపారు. 40 మంది విద్యార్థులకు 40 మంది ఉత్తీర్ణత సాధించి, తామేమి తక్కువ కాదని నిరూపించారు. అంకిత భావం గల అధ్యాపక బృందం, ముందు చూపు, పట్టుదల గల కరస్పాండెంట్ త్రిమూర్తులు సార్ పర్యవేక్షణ లో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని విద్యార్థులు తెలుపగగా, విద్యార్థుల కృషి, ఏకాగ్రత, ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలనే విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయ బృందం అంకితభావం కూడా ఈ ఫలితాలు రావడానికి కారణం అయ్యాయని, అందరి కృషి వల్లే విజయం సాధ్యం అయిందని త్రిమూర్తులు తెలిపారు. ఇదే స్ఫూర్తి తో మరింత ఉత్సాహంగా పని చేస్తామని, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందనలు, అందుకు సహకరించిన తల్లిదండ్రులకు, స్కూల్ అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## మే డే కార్మికుల దినోత్సవ శుభాకాంక్షలు



సదాశివపేట: మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కులను కపడుకుందాంలి 139ప్రపంచకార్మిక దినోత్సవం మేడే అనుబంధ సివిల్ సప్లై గోదాంవద్ద ఘనంగా నిర్వహించడం జరిగినది సివిల్ సప్లై హమాల్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యస్. కె బాబు మియా అన్నారు . గురువారం మే డే సందర్భంగా సదాశివపేటలోని సివిల్ సప్లై గోదాంలో వద్ద మేడే సందర్భంగా బి ఆర్ టియు అనుబంధ సివిల్ సప్లై రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.కె బాబు మియా జెండాను ఆవిష్కరించారు . ఈ సందర్భంగా ఎస్ కె. బాబు మియా మాట్లాడుతూ మే డే స్ఫూర్తి తో హమాలీ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. కార్మికులు ఎనిమిది గంటల పనిని నాలుగు గంటల్లో చేస్తున్నారని పెట్టుబడిదారులు మాత్రం కార్మికుల రక్తాన్ని మరింతగా పీల్చి పిప్పి చేసి సంపాదించుకోవడానికి 12 గంటల పని దినాన్ని ముందుకు తీసుకొచ్చారని ఆయన ఆరోపించారు . అసంఘటిత కార్మిక వర్గానికి ఏ విధమైన సామాజిక భద్రత లేదని ఒకపక్క కార్పొరేట్లకు 15 లక్షల కోట్ల రాయితీలు కారు చౌకగా ప్రభుత్వాలు సంస్థలను మోడీ సర్కార్ అప్పగిస్తున్నారని ద్వజ మెత్తరు %దీ=వా% రాష్ట్ర నాయకులు చింతా సాయినాథ్ గారుమాట్లాడుతూ,రైతులకు,కార్మికులకు,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్ట రితిగా వ్యవహరిస్తూ కార్మిక చట్టాలను తూట్లు పొడుస్తూ సాధిచుకున్న 8:00 గం, పని,కనీస వేతనాలు,రైతులు,కారకులు, పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తోంది అన్నారు ఈకార్యక్రమంలో బి ఆర్ మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు సంఘం నాయకులు పాషా మియా, ప్రభు, హౌసత్,వెంకటేశం ఏసురత్నం , పాండు, రాచయ్య, షర్ఫుద్దీన్ తదితరులున్నారు

# చివరకు కులగణన వైపే మొగ్గు



కులగణన ప్రతిపాదనపై గత కొన్నేళ్లుగా కారాలూ మిరియాలూ నూరుతూ వచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఎట్టకేలకు తన వైఖరి మార్చుకుంది. వచ్చే జనగణనతోపాటే కులగణన కూడా చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ బుధవారం నిర్ణయించటం దేశ చరిత్రలో ఒక కీలకమైన మలుపు. అయితే ఇప్పటికే అయిదేళ్లుగా వాయిదా పడుతూవస్తున్న జనగణన ఎప్పుడు ప్రారంభిస్తారన్న అంశంలో స్పష్టత లేదు. స్వాతంత్ర్యానంతరం అణగారిన కులాలు సైతం విద్యావకాశాలను అందుకోవటం, ఉన్నతోద్యోగాలు సాధించటం వంటి పరిణామాల కారణంగా ఆ వర్గాల్లో చైతన్యం పెరిగింది. జనాభా దామాషా ప్రాతిపదికన అవకాశాలు దక్కటం లేదన్న అసంతృప్తి ఎక్కువైంది. అందుకే కులగణన జరపాలన్న డిమాండ్ ముందుకొచ్చింది. దేశంలో దీన్ని మొట్టమొదట స్వాగతించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 2021లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కులగణన జరపాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానంచేసి పంపింది. 2024 జనవరిలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వేగవంతంగా, శాస్త్రీయంగా కులగణన నిర్వహించారు. బిహార్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు సైతం కులగణన చేశాయి. అయితే బీజేపీ మొదటినుంచీ ఈ డిమాండును వ్యతిరేకించింది. 2021 జులై 20 నాడు పార్లమెంటులో సభ్యులు అడిగిన ప్రశ్నకు జవాబిచ్చిన ఆనాటి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ 'జనగణనలో ఎప్పటిలా ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా లెక్కల సేకరణ మినహా ఇతర కులాల లెక్కింపు జరపరాదన్నది కేంద్రప్రభుత్వ విధానపరమైన నిర్ణయం' అని ప్రకటించారు. బయట ఎక్కడా నేరుగా కులగణనను వ్యతిరేకిస్తూ బీజేపీ నేతలు ప్రకటనలు చేయకపోయినా, సమాజాన్ని విచ్ఛిన్నం చేయటానికి కాంగ్రెస్ కులాన్ని ఉపయోగించుకుంటున్నదని విమర్శించేవారు. మొన్నటికి మొన్న పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు నావికాదళ లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్‌ను మతం ఏమిటో కనుక్కుని కాల్చిచంపటాన్ని ప్రస్తావించి 'వారడిగింది మతం... కులంకాదు' అని ఛత్తీస్‌గఢ్ బీజేపీ ట్వీట్ చేసింది. అయితే కులగణన చేయటమే సరైందని ఆరెస్సెస్ భావిస్తున్నదని రెండు నెలల క్రితం ఒక ఆంగ్లపత్రిక వెల్లడించినప్పటినుంచీ దీనిపై కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవచ్చన్న అంచనాలు మొదలయ్యాయి. జనాభా లెక్కలతోపాటు కులగణన కూడా జరిగితే దేశంలో దాదాపు వందేళ్ల తర్వాత ఆ ప్రక్రియ మళ్లీ అమల్లోకొచ్చినట్టవుతుంది. ఆఖరుసారి వలస పాలకుల హయాంలో 1931లో కులాలవారీ జనాభా లెక్కేశారు. అప్పట్లో 4,147 కులాలున్నట్టు తేల్చారు. 1901లో ఈ సంఖ్య 1,646. తర్వాత 1941లో కూడా కొంతవరకూ జనాభా లెక్కల్లో కులాన్ని గణించారుగానీ రెండో ప్రపంచయుద్ధ కారణంగా మధ్యలోనే ఆగిపోయింది. స్వాతంత్ర్యానంతరం ఎస్సీ, ఎస్టీల వివరాలు మాత్రమే సేకరిస్తున్నారు. పీపుల్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు 1992లో జరిపిన ఒక సర్వే ప్రకారం దేశంలో 4,635 కులాలున్నాయి. 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కులగణన నిర్వహిస్తామని వాగ్దానం చేశారు. అనంతరం సాంఘికార్థిక సర్వేకింద 2011%-%12 మధ్య ఆ లెక్కలు తీశారు. కానీ ఆ డేటాను బయటపెట్టలేదు. ఇటీవల జనగణనపై కాంగ్రెస్ పట్టుబట్టడం మొదలైంది. మతంపై ప్రధానంగా కేంద్రీకరించే బీజేపీ ఇందుకు ససేమిరా సమ్మతించబోదని, అందువల్ల ఎన్నికల్లో కులగణన తనకు ప్రధాన ఆయుధంగా మారుతుందని ఆ పార్టీ భావించింది. కానీ బీజేపీ హఠాత్తుగా మనసు మార్చుకోవటంతో కాంగ్రెస్‌కు చెప్పుకోదగ్గ నినాదం లేకుండా పోయింది. అణగారిన కులాలు అడిగాయని కాదు... కులం ఒక వాస్తవం అయినప్పుడూ, సమాజంపై దాని ప్రభావం అమితంగా వున్నప్పుడూ ఎవరి సంఖ్య ఎంతో తేల్చటం ప్రభుత్వాల బాధ్యత. ఇన్నాళ్లూ దాన్ని విస్మరించారు. ఇందువల్ల రెండు రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సంక్షేమ ఫలాలు లక్షిత వర్గాలకు సరిగా చేరటం లేదు. ఇప్పటికీ విద్యాగంధం అంటని, ప్రభుత్వ పథకాల సంగతే తెలియని కులాలవారు గణనీయంగావున్నారు. ఫలితంగా బడ్జెట్‌లలో గర్వంగా ప్రకటించుకునే పథకాలు ఆచరణలో నిరుపయోగం అవుతున్నాయి. ఇక ఇంద్ర సాహ్ని కేసులో రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సుప్రీంకోర్టు నిర్ణయం కోటా పెంపు ప్రయత్నాలకు అవరోధమవుతోంది. సమస్య వుందని ప్రభుత్వాలకు తెలిసినా, కొత్తగా తెరపైకొస్తున్న కులాలకు న్యాయం చేద్దామనుకున్నా అసాధ్యమవుతున్నది. అన్ని రంగాల్లోనూ ఆధిపత్య కులాల హవా కొనసాగుతోంది. సమయానుకూల నిర్ణయాలు తీసుకోవటంలో, గాలివాలుకు అనుగుణంగా దూసుకెళ్లటంలో బీజేపీ దరిదాపుల్లోకొచ్చే రాజకీయపక్షం మరొకటి లేదు. వాస్తవానికి గత లోక్‌సభ ఎన్నికల ముందూ... మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల సందర్భాల్లో కులగణనపై కేంద్రం నిర్ణయం ప్రకటిస్తుందని అందరూ భావించారు. అలాచేస్తే కాంగ్రెస్ డిమాండుకు తలొగ్గినట్టయ్యేది. పహల్‌గామ్ మారణకాండపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు మిన్నంటుతున్నవేళ కులగణన నిర్ణయం తీసుకోవటంతో అది తన ఘనతేనని కాంగ్రెస్ చెప్పుకునే పరిస్థితి లేకుండాపోయింది. పైగా కేంద్రంలో ఎక్కువకాలం అధికారంలోవున్నా కులగణన జోలికి పోకపోవటం... 2011%-%12లో ఆ పని చేసినా దాన్ని సామాజికార్థిక సర్వేగా చెప్పటం ఆ పార్టీకి పెద్ద మైనస్. బిహార్ ఎన్నికలు సమీపిస్తున్నవేళ తీసుకున్నా తాజా నిర్ణయం నిస్సందేహంగా బీజేపీకి ఉపకరిస్తుంది. అయితే దీని వెంబడి రాగల ఇతరేతర డిమాండ్లతో ఆ పార్టీ ఎలా వ్యవహరిస్తుందన్నది చూడాలి.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com